ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 06.06.2026 | సంపుటి : 12 సంచిక : 317 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




భాజపా అధికారంలో ఉన్న

# రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు

**మేం అధికారంలో ఉన్నప్పుడు కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాం : కేజ్రీవాల్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో తరచూ తలెత్తు తున్న ప్రశ్నాపత్రాల లీకే జీ వ్యవహారాలపై ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి మండిప డ్డారు. ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయని.. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉందని ఆరోపించారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదన్నారు. తమ పార్టీ దిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూ డా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదని తెలిపారు. భాజపా అధికారంలోకి రాగానే ఈ లీక్‌లు

మిగతా 2లో..



# విభజనను వక్రీకరించిన పవన్ వెంటనే క్షమాపణలు చెప్పాలి

**సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి**

2లో..

మీ పాలన..మా పాలనపై

# చర్చకు సిద్ధం



**బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్**

**పాలమూరులో భారాస జెండా ఎగరనీయం**

> "కరీంనగర్‌లో ఓడిపోతానేమోనని కేసీఆర్ పాలమూరుకు వచ్చారు. వలస వచ్చిన నేతను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నాం. పాలమూరు నుంచి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించుకున్నాం. ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. ఐదుసార్లు కూడా పాలమూరుకు ఆయన రాలేదు. మేకవన్నె పులి అని తెలియక కేసీఆర్‌ను ప్రజలు రెండు సార్లు గెలిపించారు. సమస్యల పరిష్కారంపై రైతులకు ఏనాడైనా భరోసా ఇచ్చారా? కేసీఆర్, ఆయన కుమారుడు, మనవడు రాజ్యాలు ఏలుతారట. వృత్తి పనులు చేసుకునేవారు ఏళ్ల తరబడి అలాగే ఉండాలట"
>
> ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నా. మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం
>
> - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- నీటి ప్రాజెక్టుల పేరుతో కోట్లు దోచుకున్నారు
- రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి మళ్లీ అప్పు పుట్టకుండా చేశారు
- జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు
- నాపై కోపంతో ఆ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు
- బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు
- పాలమూరు రెండోరోజు పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**జడ్చర్ల(జనంసాక్షి):**బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు కాదు.. పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వారి పాపాలు తీరవని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ చేసిన అన్యాయాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఎన్నటికీ మరువరని చెప్పారు. జిల్లాలోని ప్రాజెక్టులను సీఎం రేవంత్ గురు, శుక్రవారాల్లో సందర్శించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జడ్చర్ల మండలం గంగాపూర్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో

మిగతా 2లో..

# కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకైనా నీరివ్వలేదు

- కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కాళేశ్వరం చేపట్టినా..అది కాస్తా కూలిపోయింది
- జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే..
- పాలమూరు ఎంపీగా ఉండి కేసీఆర్ చేసింది శూన్యం



**మహబూబ్‌నగర్‌బ్యూరో(జనంసాక్షి):**గత బిఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు.

మిగతా 2లో..




గాంధీ వైరస్ అనుమానితుడికి

# ఎబోలా నెగటివ్

- హైదరాబాద్‌లో మరో ఇద్దరికి ఎబోలా అనుమానిత లక్షణాలు
- అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్(జనంసాక్షి):**గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్‌లో ఉన్న వ్యక్తికి ఎబోలా నెగటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ మేరకు గాంధీ వైద్యులకు ఎన్ఐవి రిపోర్ట్ అందించింది. సూడాన్ నుంచి వచ్చిన 35 ఏళ్ల అహ్మద్కు ఎబోలా నెగటివ్‌గా అనుమానంతో గాంధీలో చేర్పించిన సంగతి తెలిసిందే. కాగా హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.



# హైడ్రా మరో విజయం

**200 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్**



**రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడిన హైడ్రా**

**ఈ భూముల్లోనే చారిత్రక రాతి గుట్టలు**

**హైదరాబాద్(జనంసాక్షి):**హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. రూ.30వేల కోట్ల విలువైన భూమిని కాపాడినట్లు హైడ్రా తెలిపింది. పుప్పాలగూడ భూముల్లో చారిత్రక రాతి గుట్టలు ఉన్నాయి. ఈ భూములను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. గతంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని రక్షించాలని ఉన్నత న్యాయస్థానం మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం కావడంతో భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు ఇటీవల హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు.

## వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

గండిపేటలో ప్రభుత్వ భూములు కాజేసేందుకు కుట్ర

తమిళనాడులో అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

12లో..

కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో

# జలహక్కులు

**సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ**



**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వ హణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని

మిగతా 2లో..

## నీళ్లు,నిధులు,నియామకాల్లో ప్రభుత్వ వైఫల్యం

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

2లో..

పేదలకు గౌరవప్రదమైన జీవితమే

# ప్రజాప్రభుత్వ లక్ష్యం

**క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం**

- మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు
- పేదలకోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగం
- అధికారులతో సమీక్షలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**హైదరాబాద్(జనంసాక్షి):**

కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరా బాద్ లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

మాపై ఏళ్లతరబడి సుంకాలు విధించి

# భారత్ లబ్ధి పొందింది

**మరోసారి అక్కసు వెళ్లగక్కిన ట్రంప్**



**వాషింగ్టన్(జనంసాక్షి):**ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసిస్తూనే.. భారత్‌పై విమర్శలు చేశారు. అమెరికాపై అధిక సుంకాలు విధించి.. భారత్ ఏళ్లతరబడి లబ్ధి పొందిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇవి చర్చనీయాంశంగా మా రాయి. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు.భారత్- అమెరికా మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత సంబంధాల గురించి ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోదీ అంటే తనకు చాలా ఇష్టమని.. ఆయన గొప్ప స్నేహితుడని ట్రంప్ అన్నారు. తమ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య చర్చలకు సంబంధించిన ప్రశ్నకు బదులిస్తూ.. భారత దేశ సుంకాల విధానంపై ఆయన విమర్శలు చేశారు. 'ఏళ్లతరబడి.. అమెరికా నుంచి భారత్ చాలా లబ్ధి పొందింది. మాపై వారు భారీగా సుంకాలు విధించారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం భారత్ నుంచి మేం భారీగా లాభాలు పొందుతున్నాం' అని వ్యాఖ్యానించారు. భారత్ - అమెరికా మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదురుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడమే లక్ష్యంగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య నాలుగు రోజుల పాటు సాగిన చర్చలు ముగిశాయి. ఈ క్రమంలో ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఒప్పందానికి సంబంధించిన చర్చలు సహకార స్ఫూర్తి, ఆచరణాత్మకంగా ముగిశాయని వాణిజ్య శాఖ తెలిపింది. వస్తువుల వాణిజ్యం, కస్టమ్స్ విధానాలు, వాణిజ్య సౌలభ్యం, టారిఫేతర చర్యలు, ఆర్థిక భద్రతా సహకారం వంటి పలు అంశాలపై చర్చలు సాగినట్లు పేర్కొంది.

అత్యాధునిక యుద్ధవిమానాన్ని

# ఐక్యంగా రూపొందిద్దాం

- ఎస్‌యూ-57ను కలిసి అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి, కీలక సాంకేతికతలను పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉంది
- భారత్‌కు పుతిన్ బిగ్ ఆఫర్



**మాస్కో(జనంసాక్షి):**వైమానిక దళాన్ని బలోపేతం చేసే దిశగా ఐదోతరం యుద్ధ విమానాన్ని అమ్ములపొదిలో చేర్చుకునేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నుంచి బిగ్ ఆఫర్ వచ్చింది. అధునాతన

మిగతా 2లో..

# అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వ్యవసాయరంగంలో సమస్యలు

పశ్చిమాసియా యుద్ధం వల్ల ఎరువుల కొరత

దిగుమతి సుంకాలు తగ్గించడం వల్ల రైతులకు తీవ్ర నష్టం : మంత్రి తుమ్మల



**హైదరాబాద్(జనంసాక్షి):** కోహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణానికి శనివారం సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతుల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తామని చెప్పారు. మార్కెట్ కోసం 239 ఎకరాలు

మిగతా 2లో..

## మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత

కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

2లో..

## 'జేఈఈ అడ్వాన్స్‌డ్' డేటా లీకేజీ అవాస్తవం

ప్రచారాన్ని ఖండించిన ఐఐటీ రూర్కీ

2లో..

## తమిళనాట మరో కొత్త పార్టీ

- బీజేపీని వీడిన అన్నామలై సొంతగా పార్టీ
- పజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- మీడియా సమావేశంలో మాజీ బీజేపీ నేత

# భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు

మొదలయ్యాయని ఆక్షేపించారు. పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో గతంలో తెలంగాణలో బ్యాన్ చేసిన కోఎంప్ట్ ( గ్లోబరీనా) కంపెనీకే కేంద్రం సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని కాంట్రాక్ట్ ఇచ్చిందని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ కంపెనీ తెలంగాణలో సృష్టించిన సమస్యల వల్ల 20మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అటువంటి కంపెనీకి ఇంత పెద్ద సీబీఎస్ఈ కాంట్రాక్ట్‌ను ఇవ్వడం వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ చర్య వల్ల దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇటువంటి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని దేశ యువతకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునేలా విద్యార్థులు, పౌరులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానంత వరకు ఈ సమస్య కొనసాగుతూనే ఉంటుందన్నారు. రేపటి తరం భవిష్యత్తు కోసం ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. నీట్, సీబీఎస్ఈ పేపర్ వివాదాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వ్యవసాయరంగంలో సమస్యలు

ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు.పశ్చిమాసియా యుద్ధం వల్ల ఎరువుల కొరత వచ్చింది. అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వ్యవసాయరంగంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఇటీవల కేంద్రప్రభుత్వం పత్తి, పామాయిల్ దిగుమతిపై సుంకాలు తగ్గించింది. దిగుమతి సుంకాలు తగ్గించడం వల్ల మనదేశంలోని రైతులకు నష్టం కలుగుతోంది. పామాయిల్, పత్తి తక్కువ ధరకు వస్తున్నాయని వ్యాపారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. డీజిల్ సరఫరాల సరిగా లేకపోవడం వల్ల ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.లక్ష కోట్లు జమ చేసింది" అని మంత్రి తెలిపారు.

# అత్యాధునిక యుద్ధవిమానాన్ని కలిసి రూపొందిద్దాం

స్టెల్త్ సామర్థ్యాలు కలిగిన సుఖోయ్ ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను భారత్‌తో కలిసి సంయుక్తంగా అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి, అలాగే కీలక సాంకేతికతలను పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉందని వెల్లడించారు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ వార్తాసంస్థల అధినేతలతో మాట్లాడిన సందర్భంగా అధ్యక్షుడు ఈ ప్రతిపాదన చేశారు. భారత వైమానిక దళంలో ఐదో తరం యుద్ధ విమానాలు లేవు. మరోవైపు, పాకిస్థాన్ త్వరలో చైనాకు చెందిన షెన్‌యాంగ్ జె-35ఎ స్టెల్త్ ఫైటర్స్‌ను సొంతం చేసుకోనుందని వార్తలు వస్తోన్న వేళ రష్యా నుంచి స్పందన రావడం గమనార్హం. రక్షణరంగంలో తమ రెండు దేశాల మధ్య ఎలాంటి పరిమితులు ఉండవని చెప్పిన పుతిన్.. పరోక్షంగా పాశ్చాత్య దేశాలకు చురకలు అంటించారు. ఆ దేశాలు సాంకేతికతను బదిలీ చేసేందుకు పలు ఆంక్షలు విధిస్తుంటాయని గుర్తుచేశారు. అయితే ఎస్‌యూ-57 ఫైటర్ జెట్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు రష్యా గతంలోనే భారత్‌కు అవకాశం ఇచ్చింది. 2018లోనే ఆ చర్చలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. అయితే భారత్ అప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి వైదొలగింది. ఆ యుద్ధ విమానంతో పూర్తిస్థాయి కార్యాచరణ అవసరాలు తీరవని ఐఏఎఫ్ నిర్ధరించడంతో భారత్ వెనక్కి తగ్గింది. ఇదిలాఉంటే.. స్వదేశీ పరిజ్ఞానంతో ఐదోతరం జెట్‌ను తయారు చేసేందుకు భారత్ చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. 2030 మధ్యలో వైమానిక దళంలో చేరొచ్చని తెలుస్తోంది. భారత్-చైనా సంబంధాల్లో తమ జోక్యం ఉండబోదని పుతిన్ స్పష్టం చేశారు. అలాగే ఆ రెండింటి మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని ఇరు దేశాలూ సామరస్యంగా పరిష్కరించుకుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఇక 2030లో తాను మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఇప్పుడు మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. అప్పటికి తన ఆరోగ్యం ఎలా ఉంటుందో దేవుడికే తెలుసన్నారు. ప్రస్తుతం పరిష్కరించాల్సిన ఎన్నో అంశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# విభజనను వక్రీకరించిన పవన్ క్షమాపణలు చెప్పాలి

**సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి**

**వేములవాడ(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర విభజన తీరును వక్రీకరిస్తూ మాట్లాడిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గా÷-డ్గ÷న్ లో శుక్రవారం ప్రారంభించగా ఆయన హాజరై మాట్లాడారు. 12 సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర విభజనను మరోసారి వక్రీకరించి మాట్లాడడం సరికాదని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జాగిరే తెలంగాణ రాష్ట్రమని పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు.ఆవేశానికి కేరాఫ్ గా నిలిచిన పవన్ కళ్యాణ్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు లాంటి మేధావుల పై ఏపీలో కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. .

# 'జేఈఈ అడ్వాన్స్‌డ్' డేటా లీకేజీ అవాస్తవం

**ప్రచారాన్ని ఖండించిన ఐఐటీ రూర్కీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జేఈఈ (అడ్వాన్స్‌డ్)-2026 రాసిన విద్యార్థుల వ్యక్తిగత డేటా లీక్ అయిందని, వారి గోప్యతకు భంగం వాటిల్లిందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఐఐటీ రూర్కీ ఖండించింది. అవన్నీ అసత్య కథనాలేనని కొట్టిపారేసింది. జేఈఈ (అడ్వాన్స్‌డ్) - 2026 ఫలితాలకు సంబంధించిన క్లౌడ్ స్టోరేజ్ కాన్ఫిగరేషన్‌లో లోపం ఉన్న విషయం వాస్తవమేనని పేర్కొంది. అయితే, క్లౌడ్ స్టోరేజ్‌లో ఉన్న విద్యార్థుల డేటా కేవలం చదవడానికి మాత్రమే వీలుందని, మార్పులు, చేర్పులు చేసేందుకు అవకాశం లేదని స్పష్టంచేసింది.విద్యార్థులను తప్పుదోవ పట్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఐఐటీ రూర్కీ పేర్కొంది. అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు, పరీక్ష ఫలితాలపై ఎలాంటి ప్రభావం పడలేదని వెల్లడించింది. అయినప్పటికీ, సమాచార గోప్యతను పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపింది. లక్షలాది విద్యార్థుల వ్యక్తిగత వివరాలతోపాటు, వారి పరీక్ష ఫలితాలకు సంబంధించిన సమాచారానికి గోప్యత, రక్షణ కరవైందంటూ ఓ యువ సైబర్ భద్రతా పరిశోధకుడు ఎత్తిచూపిన నేపథ్యంలో ఐఐటీ రూర్కీ ఈ మేరకు ప్రకటన వెలువరించింది.

# మీ పాలన..మా పాలన చర్చకు సిద్ధం





ఆయన మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం ఈ జిల్లాలో నాటిన మొక్క.. తెలంగాణ సీఎంగా వృక్షమై నిలబడ్డాడని అన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ , బీఆర్ఎస్ పాలనపై రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కరీంనగర్‌లో ఓడిపోతానేమోనని కేసీఆర్ పాలమూరుకు వచ్చారు. వలస వచ్చిన నేతను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నాం. పాలమూరు నుంచి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించుకున్నాం. ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. ఐదుసార్లు కూడా పాలమూరుకు ఆయన రాలేదు. మేకవన్నె పులి అని తెలియక కేసీఆర్‌ను ప్రజలు రెండుసార్లు గెలిపించారు. సమస్యల పరిష్కారంపై రైతులకు ఏనాడైనా భరోసా ఇచ్చారా? కేసీఆర్, ఆయన కుమారుడు, మనవడు రాజ్యాలు ఏలుతారట. వృత్తి పనులు చేసుకునేవారు ఏళ్ల తరబడి అలాగే ఉండాలట. ఆ పార్టీ నుంచి ఒక్కరినీ గెలవనివ్వం జిల్లాలోని ప్రాజెక్టులను బీఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.22వేల కోట్లలో రూ.8వేల కోట్లు పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులకే ఖర్చు చేశాం. ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు తెచ్చుకున్నాం. 200 ఎకరాల్లో ఎడ్యుకేషన్ క్యాంపస్ ఏర్పాటు చేసుకున్నాం. వలసలు ఆగాలంటే పాలమూరు జిల్లా సస్యశ్యామలం కావాలి. రెండు పడకగదుల ఇళ్లు కట్టిన చోటే బీఆర్ఎస్ నేతలు ఓట్లడగాలి. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే నేను ఓట్లడుగుతా. కాంగ్రెస్ 30 నెలల పాలన.. చెబితే రామాయణం, రాస్తే భారతం అవుతుంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలన.. నా 30 నెలల పాలనపై చర్చకు సిద్ధమా?కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇరువురి పాలనపై చర్చిద్దాం. ఆ చర్చలో ఓడితే నేను క్షమాపణ చెబుతా. పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ జెండా ఎగురనివ్వం. గద్దెలు దిగాలి.. దిమ్మెలు కూలాలి. పాలమూరు గడ్డపై ఇక బీఆర్ఎస్ గుర్తు మర్చిపోవాలి. మీ గుర్తు, మీ ఎమ్మెల్యే అనేది ఇక గతమే. ఆ పార్టీ నుంచి భవిష్యత్తులో ఒక్కరినీ గెలవనివ్వం"అని రేవంత్ అన్నారు.

## కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకైనా నీరివ్వలేదు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు.

# బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

**నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం**

**బీజేపీ కోసం కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు**

**:పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**మహబూబాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# గిల్గిత్-బాల్టిస్థాన్‌లో ఎన్నికలు..

**పాకిస్థాన్‌పై మండిపడ్డ భారత్**

న్యూఢిల్లీ(జనంసాక్షి):గిల్గిత్-బాల్టిస్థాన్ ప్రాంతంలో (జూన్ 7న) సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలన్న పాకిస్థాన్ ప్రణాళికలపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. గిల్గిత్-బాల్టిస్థాన్ పేరుతో పిలిచే ప్రాంతం సహా జమ్మూ కశ్మీర్, లదాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేసింది. 1947లో భారత్‌లో అవి చట్టబద్ధంగా విలీనం అయ్యాయని ఉద్ఘాటించింది. పాక్ చేస్తున్న ఇటువంటి ప్రయత్నాలు.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నెలకొన్న తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు, అణచివేత, ఆర్థిక దోపిడీ, స్వేచ్ఛను హరించడం వంటి సమస్యలను కప్పిపుచ్చలేవని భారత విదేశాంగశాఖ పేర్కొంది. తాజా చర్యలతో ఆ ప్రాంతం పాకిస్థాన్‌కు చెందినట్లు కాదని, ఆక్రమించిన ప్రాంతాలను ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందేనని స్పష్టం చేసింది.మరోవైపు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోనూ ఎన్నికలు నిర్వహించనున్నట్లు అక్కడి అధికారులు ప్రకటించారు. ఆర్మీ, పారామిలిటరీ, సివిల్ పోలీసుల పర్యవేక్షణలో జులై 27న ఎన్నికలు జరుగుతాయని ప్రాంతీయ ఎన్నికల కమిషన్ వెల్లడించింది. పీవోకే అసెంబ్లీలో 53 సీట్లు ఉండగా.. 45 మంది సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మరో ఎనిమిది స్థానాలను మహిళలు, వివిధ రంగాల నిపుణులు, మత పెద్దలకు కేటాయిస్తారు.

# ఒమన్ చమురు టర్మినల్‌లో పేలుళ్లు

## లోడింగ్ నిలిపివేత

**టెహ్రాన్(జనంసాక్షి):**గల్ఫ్ దేశాలపై ఇరాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈక్రమంలో ఒమన్‌లోని మినా అల్ ఫహల్ ఆయిల్ టెర్మినల్‌లో భారీ పేలుడు సంభవించింది. పెద్దఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో అప్రమత్తమైన అధికారులు ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే పేలుడు సంభవించినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. దీంతో టర్మినల్‌లో చమురు లోడింగ్ నిలిపివేశారు. చమురు కోసం వచ్చిన పలు సూపర్ ట్యాంకర్లు అక్కడే చిక్కుకుపోయాయి. మళ్లీ చమురు కార్యకలాపాలు ప్రారంభమయ్యే వరకు అవి అక్కడే వేచి ఉండనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమ నౌకాదళం ఒమన్ సముద్రంలోని అమెరికా సైనిక నౌకను లక్ష్యంగా చేసుకుందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించింది. తమ దేశ జలాల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా దానిపై దాడి చేసినట్లు తెలిపింది. కాగా టెహ్రాన్ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఒమన్ సముద్ర జలాల్లోని అమెరికా సైనిక ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని.. ఏ నౌకపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టంచేసింది.



**అమెరికా తప్పిదం వల్లే కువైట్ ఎయిర్‌పోర్ట్ ధ్వంసం**

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వల్లే కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతిందని ఆ దేశ అధికారులు వెల్లడించారు. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. విమానాశ్రయ టెర్మినల్‌లో జరిగిన నష్టానికి తాము బాధ్యులం కామని పేర్కొంది. అమెరికా తయారుచేసిన పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలో సాంకేతిక లోపం వల్ల ఈ విధ్వంసం జరిగిందని తెలిపింది. కాగా ఐఆర్‌జీసీ ఆరోపణలను అమెరికా సైన్యం తిప్పికొట్టింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా డ్రోన్లతో పౌర విమానాశ్రయంపై దాడి చేసిందని పేర్కొంది. ఈ ఘటనపై అంతర్జాతీయంగా విమర్శలు ఎదురవుతుండడంతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు తమపై ఆరోపణలు చేస్తోందని మండిపడింది.

# తమిళనాట మరో కొత్త పార్టీ

- **బీజేపీని వీడిన అన్నామలై సొంతగా పార్టీ**
- **ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా**
- **గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు**
- **మీడియా సమావేశంలో మాజీ బీజేపీ నేత**

చెన్నై(జనంసాక్షి):తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను.

# మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత

**కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం**

కామారెడ్డి(జనంసాక్షి):కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత, పావని , శివాని నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మంజీరా నదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. బొల్లాక్‌పల్లి సమీపంలోని మంజీరా నదిలో అనిత, పావని, శ్రీవాణి, భాను ఈతకు దిగారు. వీరంతా నదిలో ఊబిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని రక్షించే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను రక్షించారు. అలాగే ఊబిలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బొల్లాక్‌పల్లికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం బాన్సువాడ మండలం బుడిమి గ్రామం వద్ద ఎల్లమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొన్నాయి.

# ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి అండ

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త
- తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉద్యమ ఉపాధ్యాయులు, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఘన సత్కారం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమంలో విశేష సేవలందించిన ఉపాధ్యాయులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఘన సత్కార సభ నిర్వహించారు. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. అతిథులుగా తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంధం రాములు, తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు. ప్రైవేట్ టీచర్స్ విభాగం అధ్యక్షులు అజయ్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో సేవలందించిన పలువురు ఉపాధ్యాయులు, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలు, అవార్డులతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సత్కార సభ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తూ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి సంఘీభావాన్ని చాటిన వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు.

# అమీర్ పేట్ అగ్నిప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- ప్రమాదంలో ఆస్తి నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- బాధితులకు పరామర్శ, అండగా ఉంటామని భరోసా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమీర్ పేట్ లో జరిగిన అగ్నిప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు చెబుతున్న వివరాల ప్రకారం ఈ ప్రమాదం అనుకోకుండా జరిగింది కాదని తెలుస్తోందని కవిత అన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం వెనుకల ఉన్నమెస్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు చెబుతున్న విషయాన్ని ప్రస్తావించారు. గతంలో ఇక్కడ షార్ట్ సర్క్యూట్ జరిగిందని దానిపై మూడు నెలల క్రితమే స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదన్నారు. అప్పుడే సరైన చర్యలు తీసుకోని ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. ప్రమాదంలో దాదాపు 4 కోట్లు ఆస్తినష్టం జరిగిందన్నారు. ఆస్తినష్టం పై సరైన అంచనా వేసి బాధితులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన గంటంబావు వరకు కూడా ఫైరింజన్లు రాకపోవడం అత్యంత దారుణమని, సరైన సమయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఉంటే నష్టం చాలా వరకు తగ్గేదన్నారు. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని...కానీ మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి సంఘటనలపై సీరియస్ గా దృష్టి పెట్టాలని సూచించారు.

## మాజీ మావోయిస్ట్ తిప్పిరి తిరుపతి(దేవ్ జీ) కి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పరామర్శ



మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి (దేవ్ జీ) ని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్ మెంట్ తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కవిత గారు స్వయంగా హాస్పిటల్ కు వెళ్లి దేవ్ జీ ని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, సాధారణ జీవితంలోకి అడుగుపెట్టాలని ఈ సందర్భంగా కవిత ఆకాంక్షించారు. దేవ్ జీ కి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అడవి బాట పట్టి, ఇటీవలే ఆయన జనజీవన స్రవంతిలో కలిసి విషయం తెలిసిందే.

# సీఎం ప్రజావాణిలో 718 దరఖాస్తులు

- పలు సమస్యలపై భారీగా వచ్చిన దరఖాస్తుదారులు
- దరఖాస్తులు స్వీకరించిన ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 228వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 718 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 333, ఇందిరమ్మ ఇండ్ల కోసం 251, రెవెన్యూ శాఖకు సంబంధించి 48, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అదుకారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల కుక్స్, స్వీపర్స్, వాచ్ మెన్స్ లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇప్పించాలని, పీ.ఎఫ్. సౌకర్యం కల్పించాలని కోరగా వెంటనే స్పందించిన చిన్నారెడ్డి బీసీ గురుకుల పాఠశాలల ఇంచార్జి కార్యదర్శి మల్లయ్య బట్టుతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిస్కారం చేశారు. వేషవి కాలంలో వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గణితం, ఆంగ్ల భాష విషయాల్లో శిక్షణ పొంది గొప్పగా రాణించిన నేపథ్యంలో ఆ బాలబాలికలు సీఎం ప్రజావాణికి వచ్చి తమ ప్రతిభను చాటారు. వారికి చిన్నారెడ్డి ఆశీస్సులు అందించారు. ఇలాంటి శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చిన్నారెడ్డి అన్నారు. కస్తూర్బా పాఠశాల నాన్ టీచింగ్ సిబ్బంది వచ్చి తమ సర్వీసును క్రమబద్ధికరించాలని కోరారు. విద్యా శాఖ అధికారులతో చిన్నారెడ్డి ఫోన్ లో మాట్లాడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సీఎం ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం, ఆరోగ్య శాఖ మంత్రిపై పూర్తి విశ్వాసం

- సమ్మె విరమణ, వైద్య సేవలు యథావిధిగా కొనసాగింపు: టీజీజీడీఏ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, న్యాయమైన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ '(టీజీజీడీఏ) ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. జీవో నెం. 38 ప్రకారం పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని, 4 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసుకున్న వైద్యులతో పాటు 3 సంవత్సరాల ప్రాధాన్యత కలిగిన వైద్యులు, జీరో స్పౌజ్ కేటగిరీ అభ్యర్థులకు కూడా నిబంధనల మేరకు అవకాశం కల్పించాలని అసోసియేషన్ కోరింది. అలాగే జీవో 38 ప్రకారం గుర్తింపు పొందిన అసోసియేషన్ ఎన్నికైన నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో ప్రభుత్వం, మంత్రిపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నామని టీజీజీడీఏ నాయకులు తెలిపారు.

ఈ నేపథ్యంలో అసోసియేషన్ ప్రతిపాదించిన ఆందోళన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ, ఐపీ, అత్యవసర సేవలు, శస్త్రచికిత్సలు సహా అన్ని వైద్య సేవలు యథావిధిగా, ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ ప్రథమ బాధ్యత అని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు పూర్తి స్థాయిలో సేవలందిస్తారని టీజీజీడీఏ పేర్కొంది.



## ధన్వంతరి హాస్పిటల్‌కు టిజిపిసిబి అవార్డు

**గోదావరిఖని (జనంసాక్షి) :** ఎన్టిపిసి రామగుండం ధన్వంతరి హాస్పిటల్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టిజిపిసిబి అవార్డు స్వీకరించింది..2026 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ఎన్టిపిసి రామగుండం, తెలంగాణలోని ధన్వంతరి హాస్పిటల్ పర్యావరణ సంరక్షణ, స్థిరమైన సాధనలలో చేసిన కృషి కోసం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు (టీజీ పిసిబి) ద్వారా సన్మానించబడింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వ పరిసరాల, అరణ్య, సంపత్తుల మంత్రి కొండ సురేఖ ద్వారా అవార్డు అందజేయబడింది. ఎన్టిపిసి రామగుండం, తెలంగాణ తరుపున డా. ఐ.ఆర్. లహరి అవార్డును స్వీకరించారు. ఈ గుర్తింపు ఎన్టిపిసి పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వం, బాధ్యతాయుత కార్పొరేట్ ప్రాక్టీసుల పట్ల కొనసాగుతున్న ప్రతిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పర్యావరణ నిర్వహణ, కాలుష్య నియంత్రణ, వ్యర్థనిర్వహణ, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, సమాజ అవగాహన వంటి విభిన్న కార్యక్రమాల ద్వారా, ఎన్ టి పి సి రామగుండం, తెలంగాణ శుభ్రమైన, ఆకుపచ్చ కాంతివంతమైన వాతావరణాన్ని ప్రోత్సహించడానికి నిరంతరం పనిచేస్తోంది.

# రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కాలరాయొద్దు

- ప్రొఫెసర్ జి. హరగోపాల్
- విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కాలరాయొద్దని ప్రముఖ విద్యావేత్త, టీఎస్ఈసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొ. జి. హరగోపాల్ అన్నారు. తెలంగాణలో కుప్పకూలుతున్న ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి, విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను నిరసిస్తూ 'తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టీఎస్ఈసీ)' ఆధ్వర్యంలో కవాడిగూడ ఏసీటీసీ కాలేజీ నుండి ఇందిరా పార్క్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీ, ధర్నా అత్యంత విజయవంతమైంది. వివిధ ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల సమరశీల ఐక్యతతో టీఎస్ఈసీ చేసిన ధర్నాతో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ హోరెత్తింది. ఈ మహా ధర్నా కార్యక్రమానికి యాజుజ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కె.చక్రధర రావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం ఉచిత, నిర్బంధ విద్య అనేది ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఈ హక్కును కాపాడాల్సిన రాజ్యమే (ప్రభుత్వమే) ఈరోజు విద్యను అంగట్లో సరుకుగా మార్చి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం (చీజూ) ద్వారా విద్యా వ్యవస్థను మతీకరణ, కేంద్రీకరణ చేస్తున్నారని, చీూ వంటి సంస్థల వైఫల్యం వల్ల నీట్ (చీజుజు) పరీక్ష రాసిన 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ రాజ్యంగా ఉండాల్సిన ప్రభుత్వం, కార్పొరేట్ కంపెనీలా మారడం రాజ్యాంగ విరుద్ధమని హెచ్చరించారు.

రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కె.చక్రధర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా విద్యారంగంలో కేవలం రివ్యూ మీటింగ్లకే పరిమితమయ్యారని విమర్శించారు. గత ప్రభుత్వాల కార్పొరేటీకరణ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, కేవలం కమిషన్ల కోసమే 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను' ముందుకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ లోకల్ బాడీ స్కూళ్లు మరియు మౌలిక వసతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కామన్ స్కూల్ విధానానికి ప్రజలను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20% నిధులు కేటాయించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 15% హామీని ఉల్లంఘించి కేవలం 8.2 శాతానికే పరిమితం చేయడం అన్యాయమన్నారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అనేది పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉండాలని, అప్పుడే సామాన్య, పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన చదువు అందుతుందని స్పష్టం చేశారు. విద్యారంగ పరిరక్షణ కోసం, ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు తప్పనిసరిగా 20% నిధులు కేటాయించేలా ఒత్తిడి తెచ్చేందుకు విద్యా పరిరక్షణ కమిటీ చేస్తున్న ఈ పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రొ. మాడభూషి శ్రీధర్ ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యను లాభాపేక్ష లేని సేవా రంగంగా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం చట్టాలను నీరుగారుస్తూ, సామాన్యుడికి చదువును దూరం చేసే విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కమిటీ చేస్తున్న ఈ పోరాటానికి విద్యావంతులు, మేధావులంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) పోటు రంగారావు, సీపీఐ ఎంఎల్ ఎన్డీ జె.చలపతిరావు, టి.హన్మాండ్లు, టీఎస్ఈసీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు. అశోక్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం. రఘుశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఆత్మహత్య



**ముస్తాబాద్ జూన్ 5 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో అప్పుల బాధ తట్టుకోలేక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. అవునూర్ దేవానందం 60, అనే వ్యక్తి కూతుర్ల పెళ్లిళ్ల కోసం 25 లక్షల అప్పు . ఎలా తీర్చాలని మనస్థాపానికి గురై శుక్రవారం తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుమారుడు బానోదయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి జ్యోతి తెలిపారు.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

- ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా
- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా
- సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్



**హైదరాబాద్, జూన్5 (జనంసాక్షి) :** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# అసోంలో మంత్రివర్గ విస్తరణ

- కొత్తగా 12మంది మంత్రులుగా ప్రమాణం

**గువాహటి, జూన్5 (జనంసాక్షి) :** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి మండలి సభ్యులసంఖ్య 17కు చేరింది.

కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్ సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌశిక్ రాయ్, కేషబ్ మహంతా, కి?ష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌశిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు. స్సాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

## సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

**హన్మకొండ, జూన్ 5 (జనంసాక్షి) :** సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనను సందర్శించి, రైతులను ప్రోత్సహించాలని పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రజలను కోరారు. హనుమకొండలో పబ్లిక్ గార్డెన్స్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో సేంద్రియ ధాన్యాలు, మిలెట్స్, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చేనేత వస్త్రాలు తదితర ఉత్పత్తులు (15 స్టాల్స్‌లో) అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు బయ్య సారయ్య తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగతుందన్నారు.

# విద్యా వ్యవస్థపై నల్లమచ్చ

సంపాదకీయం

పరీక్ష హాలులోకి అడుగు పెట్టే ముందు ఒక విద్యార్థి ఎంత కష్టపడతాడో అందరికీ తెలుసు. నెలల తరబడి రాత్రింబగళ్ళు చదువుకుంటాడు. అమ్మానాన్నలు కాఫీ పట్టుకొస్తారు. నిద్రను వాయిదా వేస్తాడు. ఆరోగ్యాన్ని పణంగా పెడతాడు. కానీ ఆ పరీక్ష పేపరు, అతడు హాల్లోకి అడుగుపెట్టేముందే ఎవరి చేతిలోనో ఉంటే? అది కేవలం పేపర్ లీకేజ్ కాదు, అది ఒక యువ జీవితంతో చేసిన మోసం. సీబీఎస్ఈ పరీక్ష పేపర్ల లీకేజ్ ఇప్పుడు ఒకటి రెండు సందర్భాలకు పరిమితమైన సమస్య కాదు. ఇది పదే పదే జరుగుతున్న, వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన పుండు. 2018లో గణితం, ఎకనమిక్స్ పేపర్లు లీకయినప్పుడు దేశమంతా అట్టుడికింది. పునర్పరీక్షలు నిర్వహించారు. విచారణలు జరిపారు. హామీలు ఇచ్చారు. కానీ అదే చరిత్ర మళ్ళీ మళ్ళీ పునరావృతమవుతూనే ఉంది.

పేపర్ సెట్టింగ్ నుండి పరీక్ష హాలు వరకు ఎన్నో చేతులు మారతాయి. ప్రతి చేయి ఒక సంభావ్య బలహీనత. పేపర్లు ప్రింట్ అయ్యే చోట, నిల్వ ఉండే చోట, రవాణా జరిగే దారిలో – ఏ దశలోనైనా వ్యవస్థ విఫలమవుతోంది. కోచింగ్ సెంటర్లు, మాఫియా గ్యాంగ్లు, కొందరు అవినీతి అధికారులు – ఇవన్నీ కలిసి ఒక విద్యా నేర చక్రాన్ని నడుపుతున్నాయి. వీటిలో డబ్బు చెల్లించగలిగే వారికి మాత్రమే పేపర్ అందుతుంది. అంటే ఆర్థికంగా బలహీనుడైన, నిజాయితీగా చదివిన విద్యార్థి ఈ పోటీలో మొదటే వెనకబడిపోతున్నాడు.

పేపర్ లీకయిందని తెలిసినప్పుడు ఒక విద్యార్థి మనసు ఏమవుతుందో ఊహించండి. నెలల కష్టం ఒక్కసారిగా నిరర్థకమైనట్లు అనిపిస్తుంది. పునర్పరీక్ష అంటే మళ్ళీ మొదటికి. అది కేవలం సమయం కాదు -- అది ఒత్తిడి, ఆందోళన, ఆత్మవిశ్వాస నష్టం. ఇప్పటికే పరీక్షల ఒత్తిడితో మానసిక సంక్షోభంలో ఉన్న యువతకు ఇలాంటి వార్తలు మరింత హాని చేస్తున్నాయి. దేశంలో విద్యార్థి ఆత్మహత్యల గణాంకాలు చూస్తే గుండె ఆగిపోతుంది – అందులో పరీక్ష ఒత్తిడి ప్రధాన కారణం. వ్యవస్థ ఆ ఒత్తిడికి పరిష్కారం చూపాల్సింది పోయి, పరీక్షల చిత్తశుద్ధినే సందేహాస్పదం చేసింది.

అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే – లీకేజ్ జరిగినప్పుడు బాధ్యులెవరూ తీవ్రంగా శిక్షించబడటం లేదు. ఎఫ్ఐఆర్ నమోదవుతుంది. కమిటీ వేస్తారు. రిపోర్ట్ తయారవుతుంది. ఆ తర్వాత అంతా మరుగున పడిపోతుంది. ఫలితంగా తదుపరి సారి లీకేజ్ చేసే వారికి భయమే ఉండదు. శిక్ష లేని నేరం పదే పదే జరుగుతుందనేది ప్రాథమిక సత్యం. సీబీఎస్ఈ, విద్యా మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇందులో ఒక్కరూ నైతిక బాధ్యత తీసుకోవడం లేదు.

సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందింది. పరీక్ష రోజున స్థానికంగా పేపర్లు ప్రింట్ చేసే విధానం, QR కోడ్ ఆధారిత సీలింగ్, పూర్తి డిజిటల్ నిఘా, ఆన్లైన్ పరీక్షా వ్యవస్థకు దశలవారీగా మారడం – ఇవన్నీ సాధ్యమే. కొన్ని రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాలు ఈ మార్గాల్లో ముందడుగు వేశాయి కూడా. కానీ కేంద్రీయ స్థాయిలో సంకల్పం కొరవడింది. లీకేజ్ నిరోధక చట్టం 2024 ఉన్నా అమలు నత్తనడకన సాగుతోంది. ఈ విషయంలో కేవలం ప్రభుత్వాన్ని నిందించడం సరిపోదు. తమ పిల్లలకు సులభంగా మార్కులు వచ్చే మార్గాలు వెతికే తల్లిదండ్రులు, లీక్ పేపర్లకు డబ్బు చెల్లించడానికి సిద్ధపడే సమాజం, ఇవి కూడా ఈ సమస్యకు కారణాలే. పరీక్ష అనేది జ్ఞానాన్ని కొలిచే సాధనం. దానిని కేవలం మార్కుల యంత్రంగా మార్చినప్పుడే లీకేజ్కు మార్కెట్ పుడుతుంది. విద్యలో నైతిక విలువలను పునరుద్ధరించడం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, సమాజం మొత్తం బాధ్యత.

మన పిల్లలు ఈ దేశపు భవిష్యత్తు. వారి కలలను కాపాడటం వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యం. పేపర్ లీక్ కావడం కేవలం పత్రం చేతులు మారడం కాదు, అది ఒక తరం నమ్మకాన్ని, శ్రమను, న్యాయంపై విశ్వాసాన్ని దోచుకోవడం. బాధ్యులపై కఠిన శిక్ష, పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలు, స్వతంత్ర విచారణ సంస్థ ఏర్పాటు -- ఇవి తక్షణావసరాలు. ఇప్పుడు మేల్కొనకపోతే, రేపు ఏ పరీక్షా ఫలితాన్ని నమ్మే పరిస్థితి ఉండదు. నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం ఏం జవాబు చెప్తుంది. అదే ప్రశ్న నేటి పాలకులను వెంటాడాలి.

### ఒకటై కదిలితే కరగవ కొండల్!?

కోర్ట్ స్థల మామ్ల
బలాల దెట్లొ..!?
రియ లెస్టేట్
కావొద్దస్సలు..!!
జుట్టుక్కొండూ
కాళ్లకు గుండు..
పాత సామెత
అవొద్దు బత్కు..
అది మున్గనీదు
ఇది తేల నీదూ..
సెర్వొద్దు సెట్టుపై
బోదెల్గుం పాయ్..
పోనీ కొచ్చిన
జానుంటేమ్..
అది పోతేమ్
అనె ఓమంద..
జప కోసం
జప జపన..
కత్తుల్ నూరి
కాస్కునొకటి..
తోలుకు తోలు
ముక్కా బొక్కా ..
కాళ్ళూ తలా
కాంటాకేయనె..
పానం ఉంది
ఆసర ఉందాం..
సౌలత్ జూస్తు
సాద్దారుందాం..
వొచ్చే దినాల
ఉద్దెర భ్రమల్ల..
పేగులు దీసి
గద్దల కేద్దమా..
ఎవరిదో గొంతు
సత్యం పలికెనె..
ఒకటై కదిలితే
కరగవ కొండల్..
సోయిల ఉంటే
సాధన ఖాయం
ఇథనాల్ పోరే
ఇగురం నేర్పు
సబురుగా జోడై
సమరము జేస్తే..
జన బలమెనకే
సర్కార్ అడ్గులు..!!

డా.ఇక్బాల్ పాషా
9440775732

# ఆంధ్రప్రదేశ్ "అభివృద్ధి" – భిన్న పార్టీల వైఖరులు



సమైక్య ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పన్నెండేళ్లు గడిచిపోయినా, ఆ ప్రక్రియతో ముడిపడిన అనేక ప్రశ్నలు ఇప్పటికీ సమాధానాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఒక రాష్ట్రాన్ని విభజించడం అనేది కేవలం భౌగోళిక సరిహద్దులను మార్చడం కాదు; ఆర్థిక వనరులు, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడుల ప్రవాహం, అభివృద్ధి సామర్థ్యాలను కూడా పునర్వ్యవస్థీకరించడం. అందుకే విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్కు జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం, జాతీయ రాజకీయ పార్టీలు, పార్లమెంట్ అనేక హామీలు ఇచ్చాయి. కానీ పన్నెండేళ్ల తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే, హామీల కంటే నిరాశలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

విభజన అనంతరం హైదరాబాద్ను కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ ఒక కొత్త ఆర్థిక వాస్తవాన్ని ఎదుర్కొంది. దేశంలో అత్యధిక ఐటీ ఆదాయం, సేవారంగ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు కేంద్రంగా ఉన్న నగరం తెలంగాణలో మిగిలిపోవడంతో కొత్త రాష్ట్రం ఆదాయ పరంగా వెనుకబడింది. ఈ పరిస్థితిని అప్పటి కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. విభజన తర్వాత తొలి ఏడాదిలోనే రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల రెవెన్యూ లోటు ఏర్పడిందని అధికారిక లెక్కలు చూపించాయి. అలాంటి పరిస్థితిలో ప్రత్యేక హోదా అనేది రాజకీయ నినాదం కాదు; రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి అవసరమైన కీలక సాధనం.

ప్రత్యేక హోదా ద్వారా కేంద్ర పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, అధిక కేంద్ర నిధులు లభించే అవకాశం ఉండేది. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించడానికి అది ఊత మిచ్చేది. కానీ అధికార మార్పు తర్వాత ఆ అంశం క్రమంగా రాజకీయ అజెండా నుంచి అదృశ్యమైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎన్నికల తర్వాత ప్రాధాన్యం కోల్పోయాయి. ఫలితంగా రాష్ట్రం ఆశించిన ఆర్థిక బలం అందుకోలేకపోయింది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు తలెత్తడం సహజం. ఎందుకంటే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం కేవలం రాజకీయ పత్రం కాదు; అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. ఆ చట్టంలో పేర్కొన్న అనేక అంశాలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ, ఆ ప్రాంతాల సామాజిక–ఆర్థిక సూచికలను పరిశీలిస్తే ఆశించిన మార్పు కనిపించడం లేదు. నిరుద్యోగం, వలసలు, పారిశ్రామిక వెనుకబాటు వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం, పోర్టు అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్లు వంటి ప్రాజెక్టులు కూడా చాలా కాలం పాటు ప్రకటనల స్థాయిని దాటలేకపోయాయి. కొన్ని పనులు ప్రారంభమైనా, అవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపే స్థాయికి చేరుకోలేదు. అభివృద్ధి హామీలు కాగితాలపై వేగంగా ప్రయాణించినా, నేలమీద మాత్రం నత్తనడకనే సాగాయి. పోలవరం ప్రాజెక్టు పరిస్థితి కూడా ఈ వైఫల్యానికి ప్రతీకగా నిలిచింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత అది వేగంగా పూర్తవుతుందని ప్రజలు ఆశించారు. కానీ వ్యయాలు పెరిగాయి, కాలపరిమితులు దాటిపోయాయి, నిర్వాసిత కుటుంబాల పునరావాసం ఇంకా పూర్తి కాలేదు. అభివృద్ధి పేరుతో తమ భూములు, జీవనాధారాలు కోల్పోయిన వేలాది కుటుంబాలకు న్యాయం పూర్తిగా జరగకపోవడం బాధాకరం.

అయితే ఈ మొత్తం బాధ్యతను కేంద్రంపైనే మోపి రాష్ట్ర రాజకీయ పక్షాలు తప్పించుకోలేవు. ఎందుకంటే రాష్ట్ర ప్రయోజనాల సాధనలో స్థానిక పాలకుల పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. గత పన్నెండేళ్లలో అధికారంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు కేంద్రంతో తమ రాజకీయ సంబంధాలను కాపాడుకోవడంలో చూపిన చొరవను, రాష్ట్ర హక్కుల సాధనలో చూపలేకపోయాయనే విమర్శ విస్తృతంగా వినిపిస్తోంది. అధికార అవసరాలు, వ్యక్తిగత రాజకీయ లెక్కలు, ఎన్నికల సమీకరణలు రాష్ట్ర ప్రయోజనాల కంటే ముందుకు రావడం ప్రజల్లో నిరాశను పెంచింది.

ప్రత్యేక హోదా, విభజన హామీలు వంటి అంశాలు ఎన్నికల సమయంలో ప్రధాన నినాదాలుగా వినిపించాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అదే అంశాలు పక్కకు వెళ్లిపోయాయి. ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ప్రజల ఆవేదనను ఓట్ల కోసం వినియోగించి, తరువాత మరచిపోవడం రాజకీయ వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

ఆంధ్రప్రదేశ్ కథలో అత్యంత విషాదకరమైన అంశం ఏమిటంటే, రాష్ట్రం రెండు దఫాల నష్టాన్ని ఎదుర్కొనడం. మొదట విభజనతో ఆర్థిక, పరిపాలనా సవాళ్లను ఎదుర్కొంది. తరువాత ఆ నష్టాన్ని భర్తీ చేస్తామని ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో మరోసారి దెబ్బతింది. ఈ రెండో దెబ్బే మరింత తీవ్రమైనది. ఎందుకంటే అది ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది.

దేశ పార్లమెంట్ ఇచ్చిన హామీ కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన విషయం కాదు; అది భారత ప్రజాస్వామ్య విశ్వసనీయతకు సంబంధించిన అంశం. పార్లమెంట్ ఆమోదించిన చట్టంలోని అంశాలు అమలు కాకపోతే ప్రజలు భవిష్యత్తులో ప్రభుత్వ హామీలను ఎలా నమ్మగలరు? ఒక రాష్ట్రం విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతే, సమాఖ్య వ్యవస్థపై నమ్మకం ఎలా బలపడుతుంది?అందుకే ఆంధ్రప్రదేశ్ విభజనను చరిత్రలో ముగిసిపోయిన అధ్యాయంగా చూడలేం. హామీలు నెరవేరే వరకు అది కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక ప్రక్రియగానే మిగులుతుంది. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి పెండింగ్ అంశాల అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. అదే సమయంలో రాష్ట్ర రాజకీయ పక్షాలు పరస్పర ఆరోపణలకు బదులుగా ప్రజల హక్కుల కోసం ఏకమవ్వాలి. ఎందుకంటే చరిత్ర చివరికి ఎవరు అధికారంలో ఉన్నారన్నది కాదు, ఎవరు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నదే గుర్తుంచుకుంటుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



## బాలకార్మికుడు

బాలకార్మికుని విలాసం
పేవుమెంట్లపై నివాసం
తల్లిలేదురాతండ్రిలేదురా
ముఖానాలేదురద రహాసం
ఆధునికతకునిలువుటద్దం
ఇరవైఒకటవ శతాబ్దం
ఐనాలేదురతినేందుకింత
కడుపునిండాపదార్థం!బా!

బలపంపట్టేచిట్టిచేతులు
బరువులబండినిలాగేనూ
ఐస్ ఫ్రూట్స్ డబ్బాభుజాన
మూటలు

ఏ పనికైనా కుదిరేనూ
చదువులపండగలెన్నిచేసినా
బతుకులుమారనెలేదుగా
తిరిగి తిరిగి ఏ పనికికుదిరిన
ఆకలిమంటలుతీరవుగా! !బాల!

పొట్టకూటికైచేసినఅప్పులు
రెండేరెండు వందలూ
కాగితాలపైబుగతచూపినది
వేలకువేలవడ్డీలూ
అవమానంతోఅమ్మానాన్న
తాగిరిపురుగులమందులూ
ఉన్నగుడిసెనూకాజేసి
మెడబట్టిగెంటె ఖామందులూ
!బాల!

అమ్మాఅయ్యాదయచూపండీ
దిక్కులేని ఈ దీనుడి పై
చిరిగినచొక్కామిగిలినబువ్వా
నాకు పెట్టండి పనిచేస్తా
బడికిపోవాలి అనిఉన్న
నే బతుకుభారమై పడిఉన్నా
అనిగుండెలుపిండేరోదనతో
ఆ బాలుడుమిగిలెనుకార్మికుడై
!బాల!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# రక్తంతో తడిసిన నేల తెలంగాణ

## త్యాగాల చరిత్ర, బాధ్యతల భవిష్యత్తు

తెలంగాణ పేరు వినగానే మనసులో మెదిలేది కేవలం ఒక రాష్ట్రం కాదు. అది పోరాటాల ప్రతీక. అది ఆత్మగౌరవానికి చిరునామా. అది త్యాగాల చరిత్ర. భారతదేశ చరిత్రలో అనేక ప్రాంతాలు స్వాతంత్ర్యం కోసం, రాజకీయ హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించినప్పటికీ తెలంగాణ ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడి ప్రజల పోరాటం కేవలం పాలకుల మార్పు కోసం కాదు. సామాజిక న్యాయం కోసం, భూమి కోసం, నీటి కోసం, ఉద్యోగాల కోసం, అస్తిత్వం కోసం సాగిన సుదీర్ఘ ప్రజా ఉద్యమం. అందుకే తెలంగాణను "రక్తంతో తడిసిన నేల"గా అభివర్ణిస్తారు.

ఈ నేలపై చిందిన ప్రతి రక్తపు చుక్క వెనుక ఒక చరిత్ర ఉంది. ప్రతి అమరవీరుడి త్యాగం వెనుక ఒక ఆశయం ఉంది. తెలంగాణ చరిత్రను పరిశీలిస్తే నిజాం పాలన కాలం నుంచి ప్రజల బాధల గాథ మొదలవుతుంది. భూస్వామ్య వ్యవస్థలో రైతులు బానిసలుగా జీవించారు. వెట్టి చాకిరీ, సామాజిక వివక్ష, విద్యా అవకాశాల లేమి, ప్రజాస్వామిక హక్కుల కొరత ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఆ అసంతృప్తి చివరకు 1946లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంగా రూపుదిద్దుకుంది.

తెలంగాణ రైతాంగ పోరాటం భారతదేశ చరిత్రలో అత్యంత గొప్ప ప్రజా ఉద్యమాలలో ఒకటి. భూమి కోసం, గౌరవం కోసం వేలాది మంది రైతులు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయుధాలు ఎత్తారు. ఈ పోరాటంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కానీ వారి త్యాగం వృథా కాలేదు. సామాజిక చైతన్యానికి, ప్రజాస్వామ్య భావజాలానికి పునాది పడింది.

హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం అయిన తరువాత ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినా పరిస్థితులు పూర్తిగా మారలేదు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రాంతంలో అన్యాయం జరుగుతోందనే భావన మరింత బలపడింది. ఉద్యోగాలు, సాగునీరు, విద్య, నిధుల పంపిణీలో ప్రాంతీయ అసమానతలు ప్రజల్లో ఆవేదన కలిగించాయి. ఈ నేపథ్యంలో 1969 తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. 1969 ఉద్యమం తెలంగాణ ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచింది. ముఖ్యంగా విద్యార్థులు ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విశ్వవిద్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా మారాయి. పోలీసు కాల్పుల్లో, ఘర్షణల్లో వందలాది మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ కోసం తమ భవిష్యత్తును త్యాగం చేసిన ఆ విద్యార్థుల జ్ఞాపకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో సజీవంగా ఉన్నాయి. అయితే తెలంగాణ పోరాటం అక్కడితో ముగియలేదు. 1970ల నుంచి 1990ల వరకు రైతుల సమస్యలు మరింత తీవ్రతరమయ్యాయి. సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, పంటల నష్టాలు, అప్పుల భారం రైతు కుటుంబాలను కుదేలు చేశాయి. వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం తెలంగాణ సమాజాన్ని కుదిపేసింది. రైతు కన్నీరు కూడా తెలంగాణ పోరాట చరిత్రలో ఒక భాగమే.

తెలంగాణ ఉద్యమాలకు రాజకీయ కారణాలే కాదు, సాంస్కృతిక కారణాలు కూడా ఉన్నాయి. తెలంగాణ భాష, యాస, సంస్కృతిని హేళన చేసే ధోరణి ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. తమ ప్రత్యేక గుర్తింపును కాపాడుకోవాలనే ఆకాంక్ష తెలంగాణ ఉద్యమానికి మరింత బలం చేకూర్చింది. సాహిత్యం, జానపద గీతాలు, కళారూపాలు ఉద్యమానికి ఆయుధాలుగా మారాయి.

2001లో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రజా చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. గ్రామాల నుంచి మహానగరాల వరకు ప్రజలు ఉద్యమంలో భాగమయ్యారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, రైతులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరి పోశారు. ముఖ్యంగా 2009 తర్వాత ఉద్యమం అత్యంత ఉధృతంగా మారింది. తెలంగాణ కోసం యువత చేసిన ఆత్మబలిదానాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. అక్కడి విద్యార్థులు ఎదుర్కొన్న లాఠీచార్జీలు, కన్నీటి గ్యాస్ దాడులు, అరెస్టులు ఉద్యమ తీవ్రతకు నిదర్శనం. అయినప్పటికీ ఉద్యమం ఆగలేదు. చివరకు 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. అది కేవలం కొత్త రాష్ట్రం పుట్టుక కాదు. దశాబ్దాల పోరాటానికి, వేలాది మంది అమరుల త్యాగాలకు లభించిన గౌరవం. అయితే రాష్ట్రం ఏర్పడటంతో చరిత్ర ముగిసిపోయిందని భావించడం పొరపాటు. తెలంగాణ సాధన ఒక మైలురాయి మాత్రమే. అసలు లక్ష్యం ప్రజల ఆకాంక్షల సాధన. అమరుల ఆశయాలకు అనుగుణంగా సమానత్వ సమాజ నిర్మాణం. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వారు కేవలం కొత్త రాష్ట్రం కోసం పోరాడలేదు. నీరు, నిధులు, నియామకాల కోసం పోరాడారు. సామాజిక న్యాయం కోసం పోరాడారు. ఇప్పటికీ తెలంగాణలో అనేక ప్రాంతాలు అభివృద్ధికి దూరంగానే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు కొనసాగుతున్నాయి. నిరుద్యోగం యువతను ఆందోళనకు గురిచేస్తోంది. వ్యవసాయం ఇంకా సవాళ్లను ఎదుర్కొంటోంది. విద్య, వైద్యం అందరికీ సమానంగా అందుబాటులో లేవు. ప్రాంతీయ అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. ఇవన్నీ తెలంగాణ భవిష్యత్తు ముందు నిలిచిన ప్రశ్నలు.

గిరిజనుల పోరాటాలు తెలంగాణ చరిత్రలో మరో ముఖ్య అధ్యాయం. కొమురం భీమ్ వంటి మహనీయులు "జల్–జంగల్–జమీన్" నినాదంతో సహజ వనరులపై గిరిజనుల హక్కుల కోసం పోరాడారు. దళితులు, బహుజనులు, వెనుకబడిన వర్గాలు సమాన అవకాశాల కోసం సాగించిన ఉద్యమాలు కూడా తెలంగాణ సామాజిక చరిత్రలో కీలక భాగం. తెలంగాణ మహిళల పాత్ర కూడా విశేషమైనది. రైతాంగ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు మహిళలు ముందుండి పోరాడారు. లాఠీ దెబ్బలు తిన్నారు. జైళ్లకు వెళ్లారు. కుటుంబాలను కోల్పోయినా ఉద్యమ స్ఫూర్తిని వదల్లేదు. తెలంగాణ చరిత్రలో వారి త్యాగం ఒక ప్రత్యేక అధ్యాయం.

రక్తంతో తడిసిన నేల తెలంగాణ అంటే కేవలం విషాద గాథ కాదు. అది ధైర్యానికి ప్రతీక. అది అన్యాయానికి ఎదురొడ్డి నిలిచే స్వభావానికి ప్రతీక. అది ఆత్మగౌరవానికి చిరునామా. ప్రజల సంకల్పం ఎంత శక్తివంతమో ప్రపంచానికి చూపించిన చరిత్ర. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో పోరాటం ముగియలేదు. ఇప్పుడు అభివృద్ధి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కొత్త పోరాటం కొనసాగాలి. రైతు గౌరవంగా జీవించాలి. యువతకు ఉద్యోగాలు రావాలి. గ్రామాలు అభివృద్ధి చెందాలి. గిరిజనులు, దళితులు, బడుగు బలహీన వర్గాలు సమాన భాగస్వాములుగా ఎదగాలి. అదే అమరులకు నిజమైన నివాళి. తెలంగాణ చరిత్ర మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. ప్రజల ఆకాంక్షలను శాశ్వతంగా అణచివేయలేమని, న్యాయం కోసం పోరాటం ఎప్పటికీ ఆగదని, ఆత్మగౌరవం కోసం నిలబడిన ప్రజలను ఎవరూ ఓడించలేరని ఈ చరిత్ర చెబుతోంది. అందుకే తెలంగాణ కేవలం ఒక రాష్ట్రం కాదు. అది త్యాగాలతో నిర్మితమైన ఒక భావోద్వేగం. ఒక ఉద్యమం. ఒక స్ఫూర్తి. తరతరాలకు మార్గదర్శకంగా నిలిచే ఒక చరిత్ర.

ఈ నేలపై చిందిన రక్తం వృథా కాలేదు. అది ఒక రాష్ట్రాన్ని నిర్మించింది. ఒక గుర్తింపును సాధించింది. ఒక సమాజానికి ఆత్మగౌరవాన్ని అందించింది. ఆ త్యాగాల స్ఫూర్తిని నిలబెట్టడం, సమానత్వ తెలంగాణ నిర్మించడం నేటి తరానికి ఉన్న చారిత్రక బాధ్యత.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఇంకొంత చేర్పుతో! ప్రజాస్వామ్య పునర్నిర్మాణం

దీనికి ఏకైక పరిష్కారం: జిల్లా స్థాయిలో మూడో స్వతంత్ర అధికారిగా 'జిల్లా పౌర హక్కుల అధికారి' (District Civil Rights Officer - DCRO) పోస్టును సృష్టించడం. కలెక్టర్, ఎస్పీలతో సమానమైన హోదా, అధికారాలు ఈ వ్యవస్థకు ఉండాలి. ఎస్సీ, బీసీ, ఎస్టీ కమిషన్ల వలె ఇది పూర్తిగా స్వతంత్రంగా పనిచేసే "జిల్లా పౌర హక్కుల అథారిటీ" (DCRA) గా మారాలి.

ఈ 'మూడో స్తంభం' యొక్క అధికారాలు – బాధ్యతలు:

న్యాయమూర్తి అధికారాలు (Judicial Powers): ఈ సంస్థకు నేతృత్వం వహించే వ్యక్తి ఐఏఎస్ అధికారి కాకూడదు. హైకోర్టు... పరిధిలో ఉండే ఒక డిస్ట్రిక్ట్ జడ్జ్ (ణఱరీ‌తీఱష్ట్ జీబుస్ర్తవ) స్థాయి న్యాయాధికారి దీనికి చైర్మన్గా ఉండాలి. దీనివల్ల బ్యూరోక్రసీ విచక్షణ స్థానంలో న్యాయబద్ధమైన విచారణ జరుగుతుంది.

ఆర్టికల్ 5–11 ల పూర్తి పర్యవేక్షణ: పౌరసత్వ వివాదాలు, ఎన్ఆర్సి (NRC) లేదా సిఏఏ (CAA) కి సంబంధించిన ధృవీకరణలన్నీ ఈ జుడీషియల్ అథారిటీ... పరిధిలోనే జరగాలి. ఏ సాధారణ రెవెన్యూ అధికారి పౌరుడిని వేధించడానికి వీలుండదు.

అన్ని పౌర గుర్తింపుల ఏకీకరణ (గాఱఅస్త్రశ్రీవ ఔఱఅఎశీష): ఆధార్ కార్డు, పాస్పోర్టు, ఓటర్ ఐడీ, మరియు రేషన్ కార్డుల జారీ, నిర్వహణ అధికారాలన్నీ ఈ సివిల్ రైట్స్ అథారిటీకే అప్పగించాలి.

స్వయంచాలక ఓటర్ నమోదు (Automatic Voter Enrollment): ఒక పౌరుడికి 18 ఏళ్లు నిండగానే, ఈ స్వతంత్ర సంస్థే ఆధార్ డేటా ఆధారంగా బయోమెట్రిక్ వెరిఫికేషన్ పూర్తి చేసి ఓటర్ ఐడీని జారీ చేయాలి. దీనివల్ల ఓట్ల చేర్పులు, తొలగింపులలో రాజకీయ నాయకుల, కలెక్టరేట్ సిబ్బంది అవినీతికి ఆస్కారం ఉండదు.

6. ఐఏఎస్కు ప్రత్యామ్నాయం: 'ఇండియన్ కాన్స్టిట్యూషన్ అథారిటీ' (ICA) వ్యవస్థ

జిల్లా స్థాయిలో మూడో స్తంభాన్ని నిలబెట్టడం ఒక ఎత్తయితే, ఆ వ్యవస్థను నడిపించడానికి తగిన సమర్థవంతమైన, నిష్పాక్షికమైన అధికారుల కేడర్ను తయారు చేయడం మరో ఎత్తు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఐఏఎస్ (IAS) వ్యవస్థ బ్రిటీష్ కాలం నాటి 'రెవెన్యూ వసూళ్లు, నియంత్రణ' (Collector/Magistrate) మనస్తత్వంతోనే సాగుతోంది. వీరికి చట్టాలు అమలు చేయడం తెలుసు కానీ, రాజ్యాంగ స్ఫూర్తిని, పౌర హక్కులను రక్షించాలనే జుడీషియల్ విచక్షణ తక్కువగా ఉంటుంది.

దీనికి పరిష్కారంగా... ఐఏఎస్, ఐపీఎస్ తరహాలోనే "ఇండియన్ కాన్స్టిట్యూషన్ అథారిటీ" (Indian Constitution Authority - ICA) అనే సరికొత్త కేడర్ వ్యవస్థను భారత రాజ్యాంగం ద్వారా రూపొందించాలి. ఈ సర్వీసుకు ఎంపికయ్యే అధికారులు కేవలం ఒక విభాగానికే పరిమితం కాకుండా, బహుముఖ పాత్రలను పోషించేలా చట్టపరమైన వెసులుబాటు కల్పించాలి.



**ఈ 'ఐసిఏ' వ్యవస్థ పనిచేసే తీరు, ప్రత్యేకతలు, ప్రజా చైతన్యం:**

మల్టీ–డొమైన్ బదిలీలు: ఈ ఐసిఏ (ICA) అధికారులు ఐఏఎస్ అధికారుల లాగానే సచివాలయంలో, ప్రభుత్వంలోని ఏ శాఖలోనైనా (ఎన్నికలు, పౌరసరఫరాలు, హోంశాఖ, సంక్షేమం మొదలైనవి) అత్యున్నత పోస్టులలో నియమితులు కావచ్చు.

న్యాయ వ్యవస్థతో అనుసంధానం: వీరు కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, ఒక ప్రత్యేక డెప్యుటేషన్ లేదా బదిలీ ప్రక్రియ ద్వారా జిల్లా కోర్టులలో న్యాయమూర్తులుగా (Judiciary) లేదా క్వాసి–జుడీషియల్ ట్రిబ్యునల్ల అధిపతులుగా కూడా బాధ్యతలు చేపట్టేలా ఈ వ్యవస్థను డిజైన్ చేయాలి. ఒక అధికారి పరిపాలనా రంగాన్ని (Executive) మరియు న్యాయ రంగాన్ని (Judiciary) రెండింటినీ క్షేత్రస్థాయిలో చూడటం వల్ల... వారు ప్రభుత్వ శాఖల్లో ఉన్నప్పుడు రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటారు.

రాజ్యాంగ ప్రచారం – పౌర చైతన్యం: ఐసిఏ అధికారులు కేవలం ఫైళ్లకు పరిమితం కాకుండా, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో భారత రాజ్యాంగ ఆర్టికల్సును, ఓటు ప్రాధాన్యాన్ని, పౌరహక్కులను వినూత్నంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కలిగిస్తారు. మహిళల హక్కులు, బాలల హక్కులు, బహుజనుల హక్కులు మరియు వృద్ధుల హక్కులపై పుస్తకాల ప్రచురణ ద్వారా, ప్రింట్ మీడియాతో సహా సాంస్కృతిక కళారూపాలు, లఘుచిత్రాలు మరియు సమస్త దృశ్య (ఎలక్ట్రానిక్/డిజిటల్) మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించి గ్రామీణ స్థాయి వరకు పౌరులలో అద్భుతమైన ప్రజా చైతన్యాన్ని పెంపొందిస్తారు.

నిరంకుశత్వానికి అడ్డుకట్ట: రేషన్ కార్డుల రద్దు, ఆధార్ లోపాలు, ఓటర్ల తొలగింపు వంటి విషయాల్లో ఈ అధికారులు సాధారణ బ్యూరోక్రాట్ల లాగా కాకుండా, ఒక జడ్జి లాగా రెండు వైపులా విచారించి నిర్ణయం తీసుకుంటారు. దీనివల్ల పౌరుల హక్కులకు పూర్తి భద్రత లభిస్తుంది.

పౌర సార్వభౌమత్వమే ప్రజాస్వామ్య పరమార్థం

భారత ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో విసిరిన సవాలును స్వీకరించాల్సిన సమయం వచ్చింది. చంద్రుడిపైకి యంత్రాలను పంపే సాంకేతిక సామర్థ్యం ఉన్న దేశం, తన పౌరుల ఓట్లను, వారి పౌరసత్వ రికార్డులను పారదర్శకంగా రక్షించుకోలేకపోవడం వ్యవస్థీకృత లోపం.

ఓటు హక్కును ఆర్టికల్ 19 కింద ప్రాథమిక హక్కుగా మార్చడం, ఎన్నికల సంఘాన్ని మరింత బహుళ–సభ్యులతో కూడిన జవాబుదారీ సంస్థగా విస్తరించడం, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ "జిల్లా పౌర హక్కుల అథారిటీ" అనే మూడో స్తంభాన్ని ప్రతిష్టించడం, మరియు అధికారుల బ్యూరోక్రాటిక్ నిరంకుశత్వాన్ని అరికట్టేలా 'ఇండియన్ కాన్స్టిట్యూషన్ అథారిటీ' (×జూా) వంటి సరికొత్త అఖిల భారత సర్వీసును తీసుకురావడం... ఈనాటి అత్యంత ఆవశ్యకమైన ఎజెండా.

ఈ మార్పులు కేవలం పరిపాలనా సంస్కరణలు కావు; ఇవి భారత పౌరుడికి రాజ్యాంగం ఇచ్చిన అసలైన సార్వభౌమత్వాన్ని తిరిగి అప్పగించే ఒక మహా యజ్ఞం. అప్పుడే భారతదేశం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల పీఠంపై నిజమైన 'విశ్వగురువు'గా నిలబడగలుగుతుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# తెలంగాణ రైతాంగానికి వరం.. కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 5 (జనం సాక్షి) :** తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం మంత్రి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో నిలిచిపోయిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రైతాంగానికి ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం కల్పించే లక్ష్యంతో ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు.

## 239 ఎకరాల్లో ఆధునిక మార్కెట్ నిర్మాణం

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అనుసంధానం, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కోహెడ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు మంత్రి వివరించారు. సుమారు 239 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు - అమ్మకాలు, ఎగుమతి - దిగుమతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆధునిక గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా కేంద్రాలు వంటి ప్రపంచ స్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మార్కెట్ నిర్మాణాన్ని మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, తొలి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా, పంటల కొనుగోలు వంటి పథకాల ద్వారా రైతులకు విస్తృత స్థాయిలో మద్దతు అందిస్తున్నట్లు చెప్పారు. కోహెడ మార్కెట్ ప్రారంభంతో రైతులకు మెరుగైన ధరలు, వేగవంతమైన మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం

ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కోహెడ ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాల అభివృద్ధికి నూతన ఊపునివ్వనుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## హైదరాబాద్‌కు మణిహారంగా కోహెడ మార్కెట్

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ స్థాయి సమీకృత మార్కెట్ తెలంగాణ రైతాంగానికి, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా నిలవనుందని అన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా మార్కెట్‌ను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో పాటు వినియోగదారులు ఒకే చోట నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మార్కెట్ ధరలు, లభ్యమయ్యే ఉత్పత్తుల వివరాలను ప్రజలు ఇంటి నుంచే తెలుసుకునే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

## పూర్తయిన సీఎం సభ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకానుండగా, వారి కోసం రవాణా, పార్కింగ్, తాగునీరు, భద్రత, విశ్రాంతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు, సమాచార కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర వ్యవసాయం ఒ సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్



**నారాయణపేట, జూన్ 5 (జనం సాక్షి) :** మన జీవనానికి ఆధారమైన గాలి,నీరు,నేల,చెట్లు జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు సురక్షితమని నారాయణపేట ఎంపీడీఓ సుదర్శన్ అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నారాయణపేట మండలం చిన్నజత్రం గ్రామంలో సర్పంచ్ నడిమింటి జ్యోతినాగేష్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుదర్శన్ మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు మానవాళి భవిష్యత్తుకు సవాళ్లుగా మారుతున్నా యనీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరం కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిశుభ్రమైన పచ్చని వాతావరణ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుజాత,ఉపాధి హామీ పిడి.వెంకట్రాములు,టి ఏ ప్రదీప్,ఉపసర్పంచ్ రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ దాడులు



**తాండూరు, జూన్ 5 (జనంసాక్షి) :** జిల్లా మధ్య నిషేధ మరియు ఆబ్కారీ అధికారి కే. విజయభాస్కర్ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటు సారా స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 3 నాటుసారా కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్లాపూర్ తండా, వాల్య నాయక్ తండా మరియు బాబు నాయక్ తండాలకు చెందిన నాటు సారాయి తయారీదారులు అమ్రియా నాయక్, తులసిబాయి, రెడ్య నాయక్‌లను అదుపులోకి తీసుకున్నారు. సీజ్ చేసిన నాటు సారాయి 9 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. 300 లీటర్లు సీజ్ చేసి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నాటు సారా తయారీ, విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమని అధికారులు స్పష్టం చేశారు. నిందితులతో పాటు మరో 9 మంది అనుమానితులను బషీరాబాద్ ఎంఆర్ ఓ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. నాటు సారాయి తయారీ, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే ఫోన్ 8712658754నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ ఇంచార్జి సీఐ ఎన్. రాణి హామీ ఇచ్చారు. ఈ దాడుల్లో డిటిఎఫ్ ఇన్స్పెక్టర్ కే. శ్రీనివాస్, ఎస్ఐ ప్రేమాకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో 50 శాతం రాయితీ



**ఇబ్రహీంపట్నం, జూన్ 5 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు భారం కాకుండా, వారికి పూర్తి ఫీజు రాయితీ లేదా ఉచిత విద్యను అందించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం నాడు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. జర్నలిస్టుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ, 50 శాతం ఫీజు మినహాయింపు ఇస్తూ తక్షణమే ఆదేశాలు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల కాపీలను డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషాకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా మాట్లాడుతూ, జర్నలిస్టుల కుటుంబాలకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి, డీఈఓ వెంకటేశ్వర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ 50 శాతం రాయితీ ఆదేశాలు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఖచ్చితంగా వర్తించేలా చూడాలని కోరారు. ఈ ఉత్తర్వులను అన్ని మండలాల విద్యాధికారులకు (ఎంఈఓ) పంపిస్తూ, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని డీఈఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మారాటీ రవి, జర్నలిస్ట్ నేతలు కరుణాకర్, భాస్కర్, భార్గవ్, శ్రీనివాస్, శివ మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. డీఈఓ నిర్ణయం పట్ల జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సెయింట్ ఆన్స్ స్కూలుపై చర్యలు తీసుకోవాలి



**సికింద్రాబాద్, జూన్ 5 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు,నోట్ బుక్స్ విక్రయిస్తున్న తార్నాక సెయింట్ ఆన్స్ స్కూలుపై చర్యలు తీసుకోవాలని ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లా డిఈఓ ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ...సెయింట్ ఆన్స్ స్కూలు యాజమాన్యం అక్రమంగా గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతూ పుస్తకాలను, నోట్ బుక్స్‌ను నిర్దిష్ట విక్రేతల ద్వారా అమ్ముతున్నారని పేర్కొన్నారు. తార్నాక లోని కిమితి కాలనీలోని ఒక ఇంట్లో అనుమతులు లేకుండా విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ,ఇతర విద్యా సామగ్రిని వేల రూపాయలతో కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ అక్రమ విక్రయాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రాంగణాల్లో గానీ, తమ ఆధ్వర్యంలో గానీ పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ వస్తువుల విక్రయాలు నిర్వహించరాదన్నారు. అలాగే విద్యార్థులు, తల్లిదండ్రులను నిర్దిష్ట దుకాణాల వద్ద కొనుగోలు చేయాలని బలవంతం చేయరాదని తెలిపారు. తల్లిదండ్రులకు తమకు నచ్చిన విక్రేత వద్ద నుంచి పుస్తకాలు కొనుగోలు చేసే హక్కు ఉందన్నారు. సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం దీప్తి బుక్స్ అండ్ ప్రింటర్స్ సహకారంతో రెసిడెన్షియల్ బిల్డింగ్ లో పుస్తకాల విక్రయాలు జరపడం చట్టవిరుద్ధం అన్నారు. తాము అక్కకు వెళ్ళి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పుస్తకాల విక్రయాలు నిర్వహించడం సరైనది కాదని, వెంటనే విక్రయాలను నిలిపివేయాలని నిర్వాహకులకు చెప్పామన్నారు. అయినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు లేదన్నారు. ఇటువంటి చర్యలు కొనసాగడం వల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా, విద్యను వ్యాపార వస్తువుగా మార్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది విద్యాశాఖ మార్గదర్శకాలు, ప్రభుత్వ ఆదేశాలు, విద్యా హక్కు చట్టం ఉద్దేశ్యాలకు పూర్తిగా విరుద్ధం అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పుస్తకాల విక్రయాలు నిర్వహిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా డిఈఓ కి విజ్ఞప్తి చేశారు. లేనియెడల అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, భవిష్యత్ కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందించిన వారిలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు గద్దల అంజిబాబు, జంగిలి దర్శన్,కొమ్ము శేఖర్ మాదిగ,జక్కుల మధు తదరులు ఉన్నారు.

# రైతులు దళారీలను నమ్మి మోసపోవద్దు

**నిజాంపేట్, జూన్ 5 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పరిధిలో వ్యవసాయ సాగు కోసం రైతుల కు కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ ఇటీవల కొంతకాలంగా రైతులు కొంతమంది దళారీల మధ్యవర్తిత్వంతో విక్రయాలు జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితులలో మధ్య దళారీల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వం భూమికి బదులుగా స్థలం కేటాయించే విధంగా సహకరిస్తుందని మల్కాజ్గిరి జిల్లా ఆర్డీవో శ్యాం ప్రకాష్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం పరిధిలోని సర్వేనెంబర్ 453, 454లో గల ప్రభుత్వం గత 50 సంవత్సరాల క్రితం రైతుల సాగు కోసం అసైన్డ్ ల్యాండ్ రైతులకు కేటాయించి వ్యవసాయం చేసుకునేందుకు 328 మంది రైతులకు అందజేసింది. అట్టి భూమిలో కొంతమంది రైతులు వారి వ్యవసాయానికి అనుగుణంగా సాగునీరు కొరతతో కొంతమంది రైతులు కొంతకాలంగా వారి పట్టా భూమి ఇతరులకు లీజులకు, విక్రయాలకు చేస్తుండడంతో ప్రభుత్వం ఒకానొక దశలో స్వాధీన పరచుకోవడానికి ప్రయత్నించింది. గతంలో ఈ భూములపై గత కలెక్టర్‌కు దుండిగల్ తాసిల్దార్ రైతులతో అభిప్రాయ సేకరణ చేసి పూర్తి ఆధారాలతో వివరించడం జరిగింది. ఇటీవల ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్ విషయంలో రైతులకు న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారుల ను కోరడంతో ప్రభుత్వం నుంచి ఎట్టకేలకు రైతుల అభిప్రాయ సేకరణలు చేసి నివేదిక అందజేయాలనే ఆదేశాలతో ల్యాండ్ పూలింగ్ పై ఆర్డీవో



శ్యాంప్రసాద్, తాసిల్దార్ రాజేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో దుండిగల్‌లో శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ఆర్డిఓ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ భూమి ప్రభుత్వం ఏ విధంగా తీసుకునే తీరుపై రైతులు వారి పలు అభిప్రాయాలు అధికారులకు రైతులు వ్రాత పూర్వకంగా తెలియజేస్తే, పై అధికారులకు పంపించి తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ ఇచ్చే విషయంలో ముఖ్యంగా రైతుల ఒకటిన్నర ఎకరా భూమి లో ,అర ఎకరం తమకు చెందేలా ఉండాలని సానుకూలంగా స్పందిస్తూ రైతుల అభిప్రాయపరంగా తెలియజేశారు. వారి రైతులు, నాయకులు ప్రజలు అధికారుల దృష్టికి అభిప్రాయాలను తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర క్యాంపెనింగ్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ లద్దిపీర్ల నర్సింగ్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నంగి వెంకటేశం, మాజీ సర్పంచ్ కావలి గణేష్, స్థానిక నాయకులు మండల ఆర్ ఐ రవికుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**తాండూరు, జూన్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేసేలా తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి, ఉపాధ్యక్షుడు ఒంగోనిబాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తెలంగాణ రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఈ నెల 21 న చేపట్టనున్న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి రావాలని ఆహ్వానించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం 250 గజాల ఇళ్ల స్థలంతో



పాటు పింఛను, ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. గతంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చలని కోరారు. ఈ విషయంలో మంత్రి పొంగులేటి అనుకూలంగా స్పందించినట్లు పిడమర్తి రవి తెలిపారు.

# జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి

● **ప్రొఫెసర్ హరగోపాల్**

**ముషీరాబాద్, జూన్ 5 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యా ప్రవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ కె. చక్రధర్ రావు, కార్యనిర్వా కార్యదర్శి ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి. హరగోపాల్ ,టి పి టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. తిరుపతి పలువురు నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ప్రకారం ప్రతి బిడ్డ కు ఉచిత నిర్బంధ విద్య ప్రాథమిక హక్కని గుర్తు చేశారు. ఈ హక్కును కాపాడాల్సిన రాజ్యాంగమే (ప్రభుత్వమే) నేడు విద్యను అంగట్లో సరుకుగా మార్చి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం ఎన్ ఈ పి ద్వారా విద్యావ్యవస్థను మతీకరణ, కేంద్రీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్టిఏ వంటి సంస్థల వైఫల్యం వల్ల నీట్ పరీక్ష రాసిన 21 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమరాజ్యాంగా ఉండాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలా మారడం రాజ్యాంగ



విరుద్ధమనిహెచ్చరించారు. అనంతరం చక్రధర్ రావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శిపోటు రంగారావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులుజె. చలపతి రావు, టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుపతి పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న విద్యా రంగంలో రివ్యూ మీటింగ్లు తప్ప, బిఆర్ఎస్ అమలు చేసిన కార్పొరేటీ కరణ విధానాలే కొనసాగుతున్నాయనీ అన్నారు. విద్యపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు కాదని, ఆది భవిష్యత్ తరాలకు పెట్టుబడని చెప్పుకుంటూనే దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా అత్యంత తక్కువగా విద్యకు బడ్జెట్ కేటాయించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. తద్వారా మానిటరింగ్ వ్యవస్థ కుప్పకూలి పోతుందని, పాఠశాలలో దిగజారుతున్న ఈ పరిస్థితులను ముందే గమనించిన ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, టీచర్లు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపడం మానేసి కార్పొరేట్ పాఠశాలలకు పంపుతున్నారన్నారు. అందువల్ల అత్యంత పేద తల్లిదండ్రులలో కూడా ప్రభుత్వ పాఠశాలలో న్యాయమైన విద్య దొరుకుతుందని విశ్వాసం పోయి, అప్పులు చేసిన ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారన్నారు. 2025-26 సంవత్సరానికి గాను 40 శాతంగా ఉన్న విద్యార్థుల శాతం 34 శాతానికి పడిపోయిందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఐదు సంవత్సరాలలో ఒక్క శాతం విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలలో మిగలరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న ప్రాంతాలలోనే రెసిడెన్షియల్ స్కూలను కొనసాగిస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థాపనను ఆపివేయాలన్నారు. వేలాది స్కూలను నిర్లక్ష్యం చేసి మూసి వేయడానికి దారి తీసే తెలంగాణ పబ్లిక్ స్కూల్ల స్థాపనను మానుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సెమి రెసిడెన్షియల్ పద్ధతిలో కేంద్రీయ పాఠశాల స్థాయికి అభివృద్ధి చేయాలన్నారు. అనుమతి లేని ప్రవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలను మూసివేయాలని చెప్పారు. అదేవిధంగా కొత్త సంస్థలకు అనుమతులు ఇవ్వకుండా విద్యాసంస్థల నియంత్రణ చేయడానికి కావలసిన చట్టంచేసిపకడ్బంధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫోరమ్ ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్, టి పి టి ఎఫ్ , డిటిఎఫ్, టీఎస్ ఈ సి, పి డి ఎస్ యు, న్యూ డెమోక్రసీ, పిడిఎస్యు మాస్ లైన్ , పి డి ఎస్ యు విజృంభన, ఇతర విద్యారంగా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పర్యావరణ ప్రకృతిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి



**నవాబుపేట్, జూన్ 5 (జనం సాక్షి) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నవాబుపేట్ మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో గ్రామ సర్పంచి కావలి కొండలు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ ప్రకృతిని ప్రతి ఒక్కరూ కాపాడవలసిన అవసరం ఉందని అందుకు ప్రతి గ్రామంలో పచ్చని చెట్లను పెంచి చల్లని వాతావరణాన్ని అందించే విధంగా ప్రయత్నం చేయాలని వారు మాట్లాడారు. మన జీవనానికి ఆధారమైన ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం వంటి సమస్యలు భవిష్యత్ తరాలకు ప్రమాదంగా మారుతున్నాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, నీటి వనరులను కాపాడాలి. పర్యావరణ పరిరక్షణే భవిష్యత్ తరాలకు మనం అందించే గొప్ప సంపద. స్వచ్ఛమైన, పచ్చని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామసర్పంచ్ కొండల్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామచందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, పంచాయతీ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

- ఎంపీ డికే అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 5 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని పాలమూరు ఎంపీ డికే అరుణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా ద్వారక స్కూల్ లో శుక్రవారం జరిగిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ సమావేశంలో కార్యకర్తలకు, పార్టీ నాయకులకు తెలంగాణ లో బీజేపీ అధికారంలోకి తీసుకువ చ్చేందుకు శక్తి వంచన లేకుండా పని చేయాలని దిశ నిర్దేశం చేశారు. కార్యకర్తల కఠోర దీక్ష పట్టుదల, మోదీ నాయకత్వం పై విశ్వాసంతో పశ్చిమ బెంగాల్ లోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని..తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పెద్ద కష్టమైన పని కాదని, సమిష్టి కృషితో, అందరం కలసి కట్టుగా లక్ష్యం కోసం ప్రతి కార్యకర్త కంకణబద్దులై పని చేయాలని,జిల్లా,నియోజకవర్గ, మండల స్థాయిలలో స్థానిక సమస్యల పై పోరాటాలు,దీక్షలు,నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు.కార్యకర్తలు చేసే ప్రతి పోరాటంలో తాము భాగస్వా మ్యులు అవుతామని, పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. తెలంగాణ కషాయమయం చేస్తామని సంకల్పం తీసుకొని పని చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించే కార్యకర్తకు తప్పకుండా సముచిత గౌరవం పార్టీలో దక్కుతుంద ని అన్నారు. తెలంగాణ ప్రజలు ఆదరాభిమానాలు చూరగొనలని సూచించారు. పదేళ్ల బి ఆర్ ఎస్ పాలనబిలో, ప్రస్తుతం కాంగ్రెస్ రెండేళ్లలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శించారు.భవిష్యత్ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరు అడ్డుకోలేరని విశ్వాసం వ్యక్తం చేశారు.అందుకు కార్యకర్తలు అందరి కలసి పని చేయాలని సూచించా రు.ప్రతి ఒక్క కార్యకర్త ప్రజలను చైతన్యపరచి కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానా లు తెలియజేయడంతో పాటురాష్ట్ర ప్రభుత్వ హామీ లు గుర్తు చేస్తూ వైఫల్యాల పై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండా రాష్ట్రంలో ఏ పథకం లేదని, పాఠశాల లో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలలో పోష కాహారం నుంచి మొదలు పెడితే అన్నింటిలో కేంద్రం నిధులు ఉన్నాయని తెలిపా రు.సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటార్లో తిరుగుతూ గాలి మాటలు చెబుతున్నారని,గాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గాల్లో కలసి పోతుందని ఎంపీ డీకే అరుణ ఎద్దేవ చేశారు. తెలం గాణ అభివృద్ధి పైన అవగా హన, చిత్తశుద్ధి కాంగ్రెస్ కి లేదని విమర్శించారు. పాల మూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ పదేళ్లలో కుర్చీ వేసు కొని పూర్తి చేస్తానని చెప్పి చేయలేదని,కాంగ్రెస్ రెండు న్నర ఏళ్లలో ఏం చేసింది లేదని విమర్శించారు. ఇంది రమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్య కర్తలకు ఇస్తున్నారు తప్ప నిజమైన అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు.ఇంది రమ్మ ఇండ్లు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి సొమ్ము నుంచి ఇవ్వడం లేదని, ప్రజల సొమ్ముతో ఇస్తున్నా రని ప్రతి ఒక్కరు ఎక్కడి కక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నిం చాలని అన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏ నియోజకవర్గంలో పర్యటిం చిన రోడ్ల గతి తెలుస్తుందని, కనీసం గుంతలు కూడా పూడ్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ మహ బూబ్ నగర్ జిల్లాలో జరుగు తున్న రహదారుల పనులు కేంద్రం ప్రభుత్వం నిధులతో భారత్ మాల, జాతీయ రహదారుల పనులు తప్ప మరేం లేదని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో 90శాతం ఎగ్గొట్టారని, మహి ళలకు మహాలక్ష్మీ చేయూత ప్రతి నెల 2500 రూపాయలు అన్నారు, యువతులకు స్కూటీలు, తులం బంగారం,పెన్షన్ ల పెంపు అన్నారు, ఏది ఇవ్వలేదు. రైతులు, నిరుద్యోగులను, ఉద్యోగు లను, అన్ని వర్గాలను కాంగ్రె స్ మోసం చేసిందని విమ ర్శించారు. రెండున్నర ఏళ్ళు ప్రభుత్వానికి సమయం ఇచ్చాంహామీలు అమలు చేయాలని రోజుకో అంశంతో నిరసనలు చేయాలని పిలు పునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంతన్ పాండు రెడ్డి,పగడకుల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి ,లక్ష్మీ శ్యామ్ సుందర్,కొండయ్య, లహుటి శ్రీనివాస్ ,బలరాం రెడ్డి, రఘురామయ్య , ప్రతాప్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి ,బీజేపీ నాయకులు , జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలి



**పెద్దశంకరంపేట, జూన్ 5 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో, బాధ్యతతో పనిచేయాలని ఎంపీడీవో క్రాంతి కుమార్ తెలిపారు. సాధారణ బదిలీలలో భాగంగా పెద్ద శంకరంపేట పేట మండలం నుంచి ఇతర ప్రాంతాలకు బద్ది పై వెళుతున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతికుమార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది కృష్ణ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో వారు చేసిన కృషిని గుర్తుచేసి వారికి శాలువాతో ఘనంగా సన్మానించారు. అదే సమయంలో పేట మండలానికి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందికి స్వాగతం పలికారు. కొత్త బాధ్యతలు చేపట్టిన అధికారులు ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ షాకీర్ అలీ, ఎంపీ ఓ జాకీర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని బదిలీపై వెళ్తున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను ఆత్మీయంగా ఆహ్వానించారు.

## గుర్తింపు లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దు



**మల్దకల్, జూన్ 5 (జనంసాక్షి) :** మల్దకల్, ధరూర్, గట్టు మండలంలోని వ్యవసాయ అధికారులు కలిసి బిజ్వారం, ఉలిగేపల్లి, దసరపల్లి, ధరూరు, గట్టు గ్రామాలలో శుక్రవారం తనిఖీలు చేశారు. మండలాలలో ఎక్కడ కూడా కంపెనీ (శ్రీరామ) 988 ఫండేషన్ విత్తనాలు ఎక్కడ సరఫరా లేవని మండల వ్యవసాయ అధికారులురైతులు తెలియజేశారు.కేవలం అక్షయ సాయిసీడ్స్,సత్య కంపెనీ సీడ్స్ రైతులు కొనుగోలు చేశారని గ్రామాలలో రైతులు ఈ విత్తనాలను వర్షాలు పడగానే సాగు చేస్తామని రైతులు తెలియజేశారు. మండలలోని మల్దకల్ వ్యవసాయ శాఖ అధికారికె.రాజశేఖర్, ధరూర్, శ్రీలత, గట్టు మండల ఏవోహనుమంత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు మండలలో రైతులు ఎవరి మధ్యవర్తుల మాటలు విని ఎటువంటి గుర్తింపు లేని విత్తనాలను కొనుగోలు చేయవద్దని,అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రముఖబ్రాండ్ కంపెనీ ఉన్న ప్యాకెట్ విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వీపనగండ్ల, జూన్ 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగునీరు ప్రాజెక్టుల పర్యవేక్షణకై కొల్లాపూర్ వచ్చిన సందర్భంగా వీపనగండ్ల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రం నుండి ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్ సమ్మిరెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముదిగొండ గోపి, తదితర కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

# అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం



**సంగారెడ్డి టౌన్, జూన్ 5 (జనం సాక్షి) :** తారా ప్రభుత్వ కళాశాల,సంగారెడ్డిలో ప్రజా పాలనబి ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సహకారంతో కళాశాల ఎన్.ఎస్.ఎస్.; ఎన్సిసి విభాగాలు జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించరూ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్ జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి విజయలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపినారు. ఈ భూమిపై పర్యావరణంలో సమతుల్యత ఉండాలంటే భూభాగంలో 33 శాతం వృక్ష సంపద ఉండాలని, వృక్షాలు ప్రమాదకరమైన విషవాయువులను పిలుచుకొని ఈ భూమిపై జీవించే జీవరాశికి కావలసిన ఆక్సిజన్ ను వదులుతాయని, మానవులకు సంబంధించిన అన్ని రకాల కలపను అందిస్తాయని, జీవరాశులు, పశుపక్షాదులు, జంతువులకు నివాసయోగ్యంగా పనిచేస్తాయని, కావున ప్రతి ఒక్కరూ కనీసం సంవత్సరానికి ఒక మొక్క నైన నాటి కాపాడితే భూమిపై పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని పేర్కొన్నారు. పట్టణీకరణ,నగరికరణ పేరుతో మానవుడు వృక్ష సంపదను నాశనము చేస్తున్నాడని, ఫలితంగా భూమిపై కాలుష్యము పెరిగి అనేక ప్రమాదకరమైన వ్యాధులకు కారణం అవుతున్నదని తెలిపినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగారెడ్డి లోని జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు రీజినల్ ఆఫీసుకు చెందిన అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ పి.పద్మ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, గాలి, నేల, నీటి కాలుష్యాలను తగ్గి ంచి వృక్ష సంపదను పెంపొందించాలని తెలిపినారు. మనందరి సహకారముతో మాత్రమే పర్యావరణములో సమతుల్యత సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షణ సంరక్షించడానికి కృషి చేయాలని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి మనమందరము కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మరియు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జగదీశ్వర్, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ అధికారి అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ పి.పద్మ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి క్యాడేట్లు తదితరులు పాల్గొన్నారు.

## రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 5 (జనం సాక్షి) :** భారీ వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం మండల నాయకులు, రైతులతో కలిసి మెదక్ సిద్దిపేట హైవే పైన రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం పోసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 లారీల ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని రైతులు తమకు వివరించారని తెలిపారు.శుక్రవారం కురిసిన భారీ వర్షంతో 2 కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.రైతులకు ఇంతటి కష్టాలు వచ్చినా స్థానిక ఎమ్మెల్యే కనిపించడం లేదని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు కూడా ఎమ్మెల్యే ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి మాదిరిగానే ఎమ్మెల్యే కూడా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.మరో రెండు రోజుల్లో మృగశిర కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీంతో ధాన్యం పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు.తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.లారీల కొరత, కూలీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోయిందని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైస్‌మిల్లర్లు సంచికి అదనంగా ఐదు కిలోల ధాన్యం వేస్తేనే తీసుకుంటామని చెప్పడం వల్ల రైతులు క్వింటాలుకు 12 కిలోల వరకు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన లారీలను పంపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదే. చంద్రం,మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్,నిజాంపేట్ ఎంపీపీ సంపత్,సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాతారావు,మాజీ సర్పంచ్ నర్స గౌడ్, మాజీ ఎంపీటీసీ సత్యం ,బిక్షపతి,నాయకులు ఉమామహేశ్వర్,అబ్దుల్ అజీజ్, హుస్సోద్దీన్, రొయ్యల నవీన్, మధుకర్ రాంకీ శ్రావణ్, మహేష్, రంజిత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా, బాలల సంక్షేమానికి సమిష్టి కృషి అవసరం

- భరోసా సేవల్లో శాఖల మధ్య సమన్వయం పెంచాలి
- బాధితులకు సత్వర న్యాయం, సేవలందించడమే లక్ష్యం
- ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 5 (జనం సాక్షి) :** మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు రక్షణ, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు సమర్థవంతంగా అందించేందుకు సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం భరోసా కార్యక్రమానికి సంబంధించిన కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు జరగడంతో పాటు బాధితులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవల కల్పనలో పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు సేవలు అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమయానుకూలంగా నిర్వర్తించడంతో పాటు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాధితులు అవసరమైన సేవల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే



చోట అన్ని సౌకర్యాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డియస్పి ప్రసన్న కుమార్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, సీడబ్ల్యూసీ, జేజేబీ సభ్యులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా – శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ఈఆర్‌పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి



**పెద్దశంకరంపేట, జూన్ 5 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పెద్ద శంకరంపేట తాసిల్దార్ నారాయణ ఎంపీడీవో క్రాంతి కుమార్ ఎస్సై ప్రవీణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని పోలీస్ స్టేషన్ లో ఎస్సై పోలీస్ సిబ్బంది, తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో తాసిల్దార్ ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి షర్ఫుద్దీన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శోభారాణి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ సామాజిక బాధ్యత అని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలని. మొక్కలను నాటాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సైతం ఆయా ప్రదేశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పేట ఎంపీవో జాకీర్ హుస్సేన్. ఈజీఎస్ ఏపీవో సంతోష్ కుమార్ ఈసీ నవాజుద్దీన్ పెద్ద శంకరంపేట పర్యావరణ గతి విధి బాధ్యులు శైలేష్, పడాల యశోదర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి-65పై పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- జాతీయ రహదారిపై కొనసాగుతున్న రోడ్ విస్తరణ పనులు
- ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా ఏర్పాట్లు
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్ పనుల పరిశీలన
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 5 (జనం సాక్షి) :** వర్షకాలం దృష్టిలో పెట్టుకొని సంగారెడ్డి నుండి పటాన్చెరు వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి–65పై రోడ్డు విస్తరణ పనులపై పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. శుక్రవారం జాతీయ రహదారి–65పై సంగారెడ్డి నుండి పటాన్‌చెరు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు, వాటర్ లాగింగ్ పాయింట్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల తరలింపు, నీటి పైప్‌లైన్ల షిఫ్టింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్ల వద్ద తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలపై స్లాబులు ఏర్పాటు చేసి మూసివేయాలని చెప్పారు. అవసరమైన చోట వాటర్ పైప్‌లైన్లను వెంటనే షిఫ్ట్ చేయడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు.రోడ్డు విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్, యుటిలిటీల షిఫ్టింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే రోడ్డు విస్తరణకు ప్రభావితమవుతున్న నివాస భవనాల యజమానులకు పరిహారం చెల్లించి తొలగింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారికి ఇరువైపులా ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యం, భద్రతకు



ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెద్దాపూర్ పట్నం డాబా ఎదురుగా ఉన్న కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కల్వర్టు వెంట్లను ముందుగానే శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఆర్ అండ్ బీ అధికారులు, జాతీయ రహదారుల డీఈఈ రామకృష్ణ, ఈఈ శ్రవణ్ ప్రకాష్, జీఎం రమేష్, ఆర్‌కేసీపీఎల్ కాంట్రాక్టర్ జయప్రకాష్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు, ఆర్డిఓ,తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## దామెర శివాలయంలో శఠగోపం దొంగతనం

▫ నిందితుడు అరెస్ట్




హనుమకొండ ప్రతినిధి జూన్ 5 (జనం సాక్షి) : దామెర మండల కేంద్రంలోని శివాలయంలో మార్చి నెలలో శఠ గోపం దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. శాయంపేట రూరల్ సీఐ.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, శివాలయంలోని శఠగోపాన్ని దొంగిలించిన బుస్స అరవింద్ తండ్రి రాజేందర్, వ:20 గ్రామం కంఠాత్మకూర్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా తను మరియు అండెం గోపి గ్రామం మహబూబాబాద్ అను వారలు కలిసి నేరశీ చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుండి శఠగోపాన్ని అమ్ముకోగా వచ్చిన 30000/- రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అండెం గోపి అను వ్యక్తి పరారీలో ఉన్నాడు. బుస్స అరవింద్ అను నిందితుడిపై దొంగతనం మరియు గంజాయి కేసులు ఉన్నందున సంబంధిత సెక్షన్ల కింద కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఆలయాల ఆస్తులపై ఎవరైనా దురుద్దేశపూర్వక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయం లో దొంగతనం మరియు గంజాయి విక్రయం చేసిన వ్యక్తిని పట్టుకున్న దామెర ఎస్సై కొంక అశోక్‌ని, పోలీసులను సీఐ ప్రశంసించారు.

### సభ్యత సంస్కారాల గురించి మాట్లాడే

## నైతికత కడియం శ్రీహరికి లేదు

▫ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



స్టేషన్ ఘన్పూర్, జూన్ 05 ( జనం సాక్షి ) : బిఆర్ఎస్ నాయకులు కష్టపడి గెలిపిస్తే బిడ్డ భవిష్యత్తు కోసం నియోజకవర్గాన్ని తాకట్టు పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి కి సభ్యత సంస్కారాల గురించి మాట్లాడే నైతికత లేదని తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నాయ కుడు కేటీఆర్ పై కడియం మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పెద్ద నాయకుల ను తిడితే లీడర్ అయిపోతానని చెలరేగిపోతు న్నాడని అన్నారు. రేవంత్ రెడ్డి ఏనాడు కూడా తెలంగాణ కోసం ఉద్యమం చేసిన వ్యక్తి కాదని, తెలంగాణ ఆనవాళ్లు తుడిచివేసే ప్రయత్నం జరు గుతుందని,తెలంగాణ హరితహారంపేరిట కేసీఆర్ మొక్కలు నాటితే కనీసం వాటికి నీళ్లు పోయలేని పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా కేటీఆర్ తెలంగాణ ఉనికి కోసం, తెలంగాణ ఆస్తిత్వం కోసం, తెలంగాణ ఆత్మ గౌర వం కోసం పనిచేస్తున్నాడని, కేటీఆర్ గురించి మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని అన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

▫ అదనపు కలెక్టర్ రవి



హనుమకొండ, ప్రతినిధి జూన్ 05 (జనం సాక్షి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

▫ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 05(జనంసాక్షి): జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

## మందమర్రిలో నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు



రామకృష్ణాపూర్, జూన్ 05(జనంసాక్షి): రైతులను మోసం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మందమర్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలతో పాటు రవాణాకు ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి సీఐ పర్స రమేష్ ఆదేశాల మేరకు పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు రామన్ కాలనీ బ్రిడ్జి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు ను ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు, బిల్లులు లేని నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. పోలీసుల విచారణలో పట్టుబడిన వారిని మహమ్మద్ సాహెబ్ జానీ, మహమ్మద్ అఫ్రోజ్ గా గుర్తించారు. వీరు బైంసాకు చెందిన వ్యక్తి వద్ద కిలో రూ.1,000 చొప్పున విత్తనాలు కొనుగోలు చేసి, స్థానిక రైతులకు కిలో రూ.2,500 చొప్పున విక్రయించి అధిక లాభాలు పొందాలని యత్నించినట్లు వెల్లడైంది. రైతులను నమ్మించేందుకు ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ సంచులను ఉపయోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్సై జి.నరేష్, కానిస్టేబుళ్లు రాకేష్, చైతన్యలను సీఐ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వానాకాలం సాగు సీజన్‌లో రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ప్రారంభానికి సిద్ధంగా వరంగల్ కలెక్టరేట్!

▫ జి ప్లస్ 2 తో సుమారు 80 గదుల నిర్మాణం పూర్తి
▫ గ్రీనరీ కోసం జరుగుతున్న పనులు
▫ ఈనెల 12న వర్చువల్ గా సీఎం ప్రారంభించే అవకాశం?





వరంగల్ బ్యూరో, జూన్ 05 (జనంసాక్షి) : వరంగల్ జిల్లా ప్రజల కల సహకారం కానుంది. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వరంగల్ కలెక్టరేట్ భవనం ను ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్ల చేస్తున్నట్లు సమాచారం. దీంతో వరంగల్ జిల్లా ప్రజలు హన్మకొండలో ఉన్నటువంటి కలెక్టరేట్ కు వెళ్లకుండా ఇక వరంగల్లోనే కలెక్టరేట్లో తమ పనులు చేసుకోవడానికి అవకాశం ఏర్పడనుంది. గత టిఆర్ఎస్ ప్రభుత్వం 17-6-2023 న 8000 లక్షల నిధులతో అప్పటి రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కె టి ఆర్) వరంగల్ నుండి నర్సంపేట వైపు వెళ్లే దారిలో ఆజం జాహి మిల్ స్థలంలో (ఓ సిటీ వద్ద) సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, నివాస గృహములకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. సుమారు మూడు సంవత్సరాలుగా రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం కలెక్టరేట్లో సుమారు 80 గదుల నిర్మాణం పూర్తయినట్లు సమాచారం. అదేవిధంగా కలెక్టర్ భవనము, జాయింట్ కలెక్టర్లకు విడివిడిగా రెండు భవనాలు నిర్మాణం కూడా అయ్యాయి. కలెక్టరేట్ భవనం లో ఆధునికమైనటువంటి గదులను నిర్మాణం కూడా చేశారు. విద్యుత్తు ఇతర సౌకర్యాలు కలిగించారు. భవనం చుట్టూ పక్క రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం భవనం ముందు గ్రీనరీ కోసం ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైనటువంటి పార్కింగ్ స్థలాన్ని కూడా ఏర్పాటు చేశారు. విద్యుత్తులైట్లను అమర్చారు. కలెక్టరేట్ భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని, జాతీయ జెండా నిరంతరం ఎగిరేల కావలసిన స్తంభాన్ని కూడా నెలకొల్పారు. కలెక్టరేట్ భవనం ఆవరణలో పూర్తిగా గ్రీనరీతో ఉండేలా ఆహ్లాదకరంగా కనిపించేలా సంబంధిత సిబ్బంది తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా వాటర్ సప్లై కోసం పైప్ లైన్స్ నిర్మాణం చేశారు. కలెక్టరేట్ కార్యాలయ సముదాయ భవనంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ తమ గదులను గుర్తించి కలెక్టరేట్ ప్రారంభం కాగానే షిఫ్ట్ అయ్యే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 5 కలెక్టరేట్ భవనాలను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అందులో వరంగల్ జిల్లా కలెక్టరేట్ కూడా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో భవన నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్ పనులు మరింత వేగవంతంగా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగంగా చేసి పూర్తి చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఏది ఏమైనా వరంగల్ జిల్లా కలెక్టరేట్ భవనం ప్రారంభం అవ్వాలని వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక ప్రజా దర్బార్

▫ మహిళల ఆర్థిక పురోగతికి కొత్త అవకాశాలు కల్పిస్తాం
▫ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, జూన్ 05(జనంసాక్షి) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మహిళల ఆర్థిక పురోగతికి కొత్త అవకాశాలు సృష్టిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో బిట్టుపల్లి,బంధాల,పోచాపూర్,నర్సాపూర్ పి.ఎల్., బొల్లెపల్లి గ్రామాల ప్రజల నుంచి, లింగాల గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఒడ్డుగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వల, కోడిశాల గ్రామాల ప్రజల నుంచి మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోచాపూర్--నర్సాపూర్-అల్లిగూడెం రహదారి అభివృద్ధితో పాటు పలు అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా చెక్‌డ్యామ్‌లు, రహదారులు, వంతెనల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అటవీ అనుమతుల కారణంగా పెండింగ్‌లో ఉన్న రహదారి పనులకు అవసరమైన అన్ని అనుమతులు సాధించి పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వాగులు, చెరువుల అభివృద్ధికి సుమారు రూ.70 నుంచి రూ.80 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి లింగాల ప్రాంతంలో నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఈ ప్రాంతంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల విషయంలో అర్హులైన రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా చేపలు, పచ్చళ్లు తదితర ఉత్పత్తుల విక్రయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం, శిక్షణ అందిస్తోందని తెలిపారు. అడవి ప్రాంతాల్లో లభించే వనరులను ఆదాయ మార్గాలుగా మలచుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ములుగు నియోజకవర్గంలో ఇప్పటికే 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరో 2 వేల ఇళ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గృహ అవసరాలు అధికంగా ఉన్నందున ఐటీడీఏ పరిధిలో మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన రైతులకు సాగునీటి అవసరాల కోసం బోర్లకు అనుమతులు కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సర్పంచులకు తగిన అధికారాలు కల్పించామని అన్నారు. గతంలో రవాణా సౌకర్యాలు లేని గ్రామాలకు ప్రస్తుతం మెరుగైన రహదారి సదుపాయాలు కల్పిస్తున్నామని, పోచాపూర్-అల్లిగూడెం-నర్సాపూర్ మార్గంలో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు ఇందుకు నిదర్శనమని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి దూర ప్రాంతాల ప్రజలు రావాల్సి వస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలకు చేరువగా ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు లేదా మూడు గ్రామపంచాయతీలను సమూహంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత సౌలభ్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను అధికారులకు తెలియజేసి దరఖాస్తులు సమర్పించాలని, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. అంతకుముందు తాడ్వాయి మండలం బందాల గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత రహదారిని, రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, బొల్లెపల్లి నుంచి పోచాపూర్ వరకు రూ.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ 2 పనులను, పోచాపూర్ గ్రామం నుంచి అల్లిగూడెం వయా నర్సాపూర్ వరకు రూ.6 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ 3 పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం తాడ్వాయి మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు 20 కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ఓ వికాస్ మీనా,అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి.,సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించాలి

▫ ప్రజల సమస్యలు తెలుసుకోవాలి
▫ మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

కాసిపేట, జూన్ 5 (జనం సాక్షి) : ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి అని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కాసిపేట పోలీస్ స్టేషన్‌ను డీసీపీ తనిఖీ చేశారు. డీసీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం స్టేషన్ రిసెప్షన్, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డు లు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు డీసీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ... ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై, ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై, సిసి కెమెరాల ప్రాముఖ్యత పై అవగహన కల్పించాలని,చట్ట వ్యతిరేక కార్య కలాపాలు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహా రించాలని డీసీపీ అధికారు లు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సిఐ పర్స రమేష్, కాసిపేట్ ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

## గంజాయి సేవించే అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు

▫ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసులు నమోదు
▫ జిల్లాలో గంజాయి వినియోగంపై కఠిన నిఘా
▫ జిల్లా ఎస్పీ శబరిష్



మహబూబాబాద్ బ్యూరో, జూన్ 05(జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, రూరల్ సీఐ అంజలి, 7 మంది ఎస్ఐలు, 40 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు, చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, పార్కులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగంపై ఆరా తీశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 25 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అనుమానాస్పద 15 మంది వ్యక్తులకు గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో రిజల్ట్ నెగెటివ్ వచ్చినది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ, గంజాయి విక్రయదారులు, సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. గంజాయి యువత భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక దురాచారమని, జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు, అలాగే గంజాయి అలవాటుతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ 8712656999కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.



## మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి

▫ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కడెం, జూన్ 5 (జనంసాక్షి) : కడెం మండలంలోని దిల్దార్ నగర్ గ్రామంలోని శ్రీ అక్కకొండ లక్ష్మి నరసింహా స్వామి ఆలయం వద్ద ఉన్న హరిత హారం పార్క్ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు కూడా తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందించేలా ప్రతి ఒక్కరు ఇంటికొక మొక్కను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, ఏపీ డి రత్న కళ్యాణి, ఎంపీడీవో అరుణ, ఎంపీఓ శ్రీనివాస్, పలువురు అధికారులు గ్రామ సర్పంచ్ స్టీఫెన్, పలు గ్రామ సర్పంచులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శనను ప్రారంభించిన మంత్రులు




**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 5 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో హైదరాబాద్ హైటెక్స్ హాల్ నెంబర్ 4 లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శన మరియు విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య పాల్గొని ప్రదర్శనలోని చేనేత స్టాళ్లను సందర్శించారు. ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చేనేత కుటుంబాల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తామని, హైదరాబాద్ నగర ప్రజలు, చేనేత ప్రియులు జూన్ 5 నుండి జూన్ 7 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ చైర్మన్ వెంకరమణ ,పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, ప్రజాప్రతినిధులు, చేనేత జౌళి శాఖ , ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి

- టీపీసీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 5 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తన సేవలను మరింత వేగవంతం చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

### సేవల్లో నాణ్యత పెరగాలి..

ఈ సందర్భంగా మాట్లాడుతూ...మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన




బాధ్యత. బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని సూచించారు.

### సమస్యల పరిష్కారమే లక్ష్యం

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్‌వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

### సంస్థ బలోపేతం అందరి బాధ్యత

బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, యాసా వెంకటేశ్వర్లు, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్ నాయక్, కనకరాజు, మచ్చా రామారావు, రామ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడండి



**మణుగూరు, జూన్ 5 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన బాధ్యతని మణుగూరు న్యాయమూర్తి కంభపు సూరి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మణుగూరు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన బాధ్యతని ప్రతి పౌరుడు ప్రకృతి, అడవులు, నదులు, సరస్సులు వన్యప్రాణులను సంరక్షించి అభివృద్ధి చేయాల్సిన ప్రాథమిక విధి ఉందని వివరించారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ చట్టం, అటవీ సంరక్షణ చట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టం, వంటి చట్టాల లక్ష్యం ప్రకృతి సంపదను కాపాడటమేనని తెలిపారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా, వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దినప్పుడే పర్యావరణ పరిరక్షణ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొట్టే అజయ్ కుమార్,మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురు కృష్ణ, జనరల్ సెక్రటరీ వీర మధుసూదన్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎఫ్ఆ ఆర్ ఓ ఉపేంద్ర, అటవీ శాఖ సిబ్బంది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

## ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి

### భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**టేకులపల్లి, జూన్ 5 (జనంసాక్షి) :** టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యత, దరఖాస్తుల పరిష్కార విధానం, కార్యాలయ నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో పారదర్శకంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలనిసూచించారు. అనంతరం ప్రజావాణి, భూభారతి, సాదా బైనామా, జనన--మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర దరఖాస్తుల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు. దరఖాస్తుల నమోదు, పరిష్కార స్థితికి సంబంధించిన రిజిస్టర్లు,రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని తాసిల్దార్ వీరభద్రంను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వాటి నిర్వహణపై అధికారులను ప్రశ్నించారు.



భద్రతా పరంగా సీసీ కెమెరాలు కీలకమని, వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి అన్ని కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయ కార్యకలాపాల పర్యవేక్షణకు సీసీ కెమెరాల వ్యవస్థ సమర్థవంతంగా ఉండాలని సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సమయపాలన పాటించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రతి పౌరునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు.ఈ తనిఖీలో సంబంధిత రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయం పక్కనే దుర్భర పరిస్థితి

- నిలిచిన మురుగునీరు.. దుర్గంధంతో ప్రజలకు నరకయాతన
- దోమల బెడదతో అంటువ్యాధుల భయం
- వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 5 (జనం సాక్షి) :** గ్రామ పాలనకు కేంద్రబిందువైన పంచాయతీ కార్యాలయం సమీపంలోనే పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. అన్నపురెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సీసీ రోడ్డుపై మురుగునీరు నిత్యం నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజలు ఇదే మార్గంలో ప్రయాణించాల్సి రావడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు దుర్గంధాన్ని వెదజల్లుతూ పరిసరాలను కలుషితం చేస్తోంది. దీంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే



ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ కార్యాలయానికి అతి సమీపంలోనే ఈ పరిస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు విపరీతంగా పెరిగిపోతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత విషమించే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. రోడ్డు పక్కన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోతోందని చెబుతున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 9 మందికి జరిమానా

**బూర్గంపహాడ్, జూన్ 5 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- మద్యం సేవించి వాహనాలు నడుపుతూ బూర్గంపహాడ్ పోలీసులకు పట్టుబడిన 11 మంది వాహనదారులను భద్రాచలం కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ 11 మందికి జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఎస్ ఐ మేడా ప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి పట్టుబడిన వారిలో 9 మందికి రూ.300 నుంచి రూ.2వేల వరకు జరిమానా విధించగా ఇద్దరు వ్యక్తులకు ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.100 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ అక్షయ యాదవ్




**వలిగొండ, జూన్ 5 (జనం సాక్షి) :** వలిగొండ పోలీస్ స్టేషన్ ని శుక్రవారం వార్షిక తనిఖీలో బాగంగా జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తునా సిబ్బంది యొక్క యూనీఫాం దరించే విదానం, వారి యొక్క వ్యక్తి గత సామగ్రి ఉండే పెట్టెను తనిఖీ చేసిన యెడల పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాన్ని సందర్శించారు.పోలీస్ స్టేషన్ లోపల జనరల్ డైరీ పరిశీలించిన తర్వాత హెల్ప్ డెస్క్ విదులు అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇన్చార్జి వద్ద గల జనరల్ డైరీ ని తనిఖీ చేసి వారి యొక్క విధులను గురించి విచారించారు,కోర్టు రికార్డు గది తనిఖీ చేసి ఎవిడెన్స్ ప్రాపర్టీ ని ఆర్డర్ లో పెట్టుకోవాలి అని ఆదేశించారు. ఈ పెట్టి ,పిటిషన్ పెండింగ్ ,రెజిస్టర్డ్ పిటిషన్ లను ఎప్పటికీఅప్పుడు సంబందిత రికార్డు లలో పొందుపరచాలని ఆదేశించారు సి సి టి ఎన్ ఎస్ , సి ఐ ఎస్ ఆర్,పోర్టల్ ల పనితీరును పరిశీలించారు, సైబర్ నేరాల వివరాల యొక్క పాత కేసుల వివరాలను కంప్యూటరు లో తనిఖీ చేశారు, లాక్ అప్ రూమ్ తనిఖీ చేసి వాటిలో గల సీసీటీవీ ల పనితీరు అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్ ల యొక్క రికార్డు లను పరిశీలించి వారి యొక్క ప్రవర్తనల గురించి అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ బయట గల రికవరీ వాహనాల ను పరిశీలించి వాటికి సంబందించిన క్రైమ్ నెంబర్ ని వాటిపైన వేసి వాటి యొక్క నేరాల నెంబర్ ఆధారంగా ఆర్డర్‌లో పెట్టాలి అని ఆదేశించారు. ఈ ఇన్స్పెక్షన్ జిల్లా ఎస్పీ ఆద్వర్యంలో చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు , ఎస్సై యుగేందర్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

**బూర్గంపహాడ్, జూన్ 5 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కర్మాగారం పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ కోసం పాటించాల్సిన అంశాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ రాంబాబు, టెక్నికల్ హెడ్ జయంత్ కుమార్దాస్, ఎన్విరాన్మెంట్ హెడ్ ప్రఫుల్లా కుమార్ సమంత సింగార్ లతో కలిసి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలని, మొక్కలతో మంచి ఆక్సిజన్ లభిస్తుందన్నారు. కాలుష్యాన్ని నివారించడం కోసం కర్మాగారంలో పచ్చదనానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. అనంతరం కార్మిక కుటుంబాల పిల్లలు, మేనేజర్లు, కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా కర్మాగారం పరిసరాల్లో, లారీ యార్డు ఆవరణలో మేనేజర్లు, ఐటీసీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అధికారులు చెంగల్రావు, టీఎస్ భాస్కర్, ఆర్పీ సింగ్, మనీష్ శర్మ, శివరామకృష్ణ, సౌరబ్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామపంచాయతీల్లో...

మండల కేంద్రమైన బూర్గంపహాడ్తో పాటు అన్ని పంచాయతీల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్, ఉపసర్పంచ్లు కార్యాలయాల్లో పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రకృతి మానవాళికి ప్రాణాధారం.. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతగా తీసుకుని భావితరాల భద్రతకు ప్రకృతిని రక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు.




ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్ లు, కార్యదర్శులతో పాటు పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంజనాపురం పాఠశాలకు రాష్ట్ర ఉత్తమ పర్యావరణ పాఠశాల అవార్డు




**బూర్గంపహాడ్, జూన్ 5 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని అంజనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పర్యావరణ పాఠశాల అవార్డు దక్కింది. హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలో పాఠశాల హెచ్‌ఎం టి.కిషన్ రావు కు ఈ అవార్డును రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా శుక్రవారం అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో మూడు పాఠశాలలకు అవార్డులు వస్తే అందులో అన్ని అంశాల్లో ఎంపీపీఎస్ అంజనాపురం పాఠశాల ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణం. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.బాబూరావు, ఎస్ శంకర్, ఎస్ సునీత, బి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్

**ఎర్రుపాలెం, జూన్ 5 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు ఖమ్మం స్థంబాద్రి సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో రెడ్డి కళ్యాణ మండపంలోకాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతి.సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్యే, కొండబాల.కోటేశ్వరరావు, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎరుపాలెం కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడుగా వెంకటాపురం గ్రామానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారాధ్యంలో అందరికీ అన్ని అవకాశాలు కల్పిస్తూ మధిర నియోజకవర్గం ముఖ్యంగా ఎరుపాలెం మండలం ప్రత్యేక చొరవచూపి అభివృద్ధి పథంలోముందుకునడిపించారన్నారు. అలాగే మన్ముందు ఆయన సారాధ్యంలో మరింత అభివృద్ధి చేసుకొని పార్టీ కోసం పనిచేసి నాయకులు కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు పదవి బాధ్యతలు అప్పగించిన బట్టి విక్రమార్క కు జిల్లా పెద్దలకు నాకు సహకరించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే తనకు అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా బాధ్యతగా అందరిని సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, రాయల.నాగేశ్వరరావు, ఖమ్మం స్తంభాద్రి సుడా చైర్మన్ పువ్వాళ్ళ. దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాణ గౌడ్, జిల్లా మాజీ, ఎమ్మెల్యే, కొండబాల కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్, అధ్యక్షులు, వేజెండ్ల సాయికుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, సౌజన్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి పిసిసి సభ్యులు, శీలం ప్రతాపరెడ్డి, మధిర,ఏఎంసి, చైర్మన్, బండారు నరసింహారావు, మాజీ,ఏఎంసీ, చైర్మన్, చావా రామకృష్ణ బ్లాక్



కాంగ్రెస్ అధ్యక్షులు, చావా.వేణు, రంగా.హనుమంతరావు, వేమిరెడ్డి.శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఐలూరి.వెంకటేశ్వర రెడ్డి,రంగరాజు, బొగ్గుల.గోవర్ధన్, రెడ్డి,కర్నాటి.సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు, గంటా.తిరుపతమ్మ, కడియం.శ్రీనివాసరావు, శీలం.వెంకటరామిరెడ్డి, తలపురెడ్డి.నాగిరెడ్డి, బి.శ్రీనివాస్ రెడ్డి, ఐ.ఎన్.టియూసి,నాయకులు,లింగాల.నాగేశ్వరరావు,డి.రాజీవ్ గాంధీ, డి.శ్రీను, జి.బాబు, పలువురు, సర్పంచులు నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ ఐపీఓకు 127 రెట్ల స్పందన




**దిల్లీ:** నాన్-ఫెర్రస్ లోహాల రీసైక్లర్ అయిన సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. శుక్రవారంతో సబ్‌స్క్రిప్షన్ గడువు ముగియగా.. 127 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ముఖ్యంగా క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించడంతో భారీ సబ్‌స్క్రిప్షన్ సాధ్యమైంది. ఐపీఓ కార్యకలాపాలు ఇటీవల దాదాపు స్తంభించిన వేళ.. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ ఐపీఓ బంపర్ సబ్‌స్క్రిప్షన్ నమోదు చేయడం విశేషం. రూ.631 కోట్ల ఐపీఓలో ఒక్కో ఈక్విటీ షేరు ధరల శ్రేణి రూ.182-192గా కంపెనీ నిర్ణయించింది. 2,30,43,930 (2.30 కోట్లు) షేర్లకు గానూ.. 2,92,75,44,594 (292 కోట్లు) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. కేటగిరీలా వారీగా చూసుకుంటే క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 270.6 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషన్ ఇన్వెస్టర్ల (ఔఎఎ) కోటా 172.35 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 27.03 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. తొలిరోజే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకోవడం గమనార్హం. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటికే రూ.188.44 కోట్లు సమీకరించినట్లు కంపెనీ వెల్లడించింది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ (ాఈబా) రూపంలో నిధుల సమీకరణ జరుగుతోంది. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు తమ వాటాలను విక్రయిస్తుండడంతో కంపెనీకి ఎలాంటి నిధులూ రావు. నాన్-ఫెర్రస్ లోహాల రీసైక్లర్ అయిన సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్‌కు దేశవ్యాప్తంగా 13 రీసైక్లింగ్ యూనిట్లు ఉన్నాయి. హోండా కార్స్, బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థలు ఈ కంపెనీకి క్లయింట్లు. ఈ నెల 10న ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానున్నాయి.

## 2025-26లో జీడీపీ వృద్ధి 7.7 శాతం




**న్యూఢిల్లీ:**భారత్ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 7.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.1 శాతంగా ఉంది. జనవరి- మార్చి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ మేరకు స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ గణాంకాలను శుక్రవారం వెల్లడించింది.2024-25 ఆర్థిక సంవత్సరలో స్థిర ధరల వద్ద జీడీపీ రూ.229.89 లక్షల కోట్లుగా ఉండగా.. 2025-26 సంవత్సరంలో రూ.323.12 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 2024-25లో రూ. 318.07 లక్షల కోట్లు ఉండగా.. 2025-26లో అది రూ.346.36 లక్షల కోట్లకు చేరుకున్నట్లు పేర్కొంది.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు, ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో మన సూచీల్లో ఊగిసలాట కనిపించింది. ఐటీ, మెటల్ సెక్టార్ల షేర్లు నష్టపోయాయి.ఉదయం సెన్సెక్స్ 74,629 వద్ద ప్రారంభమైంది. క్రితం ముగింపుతో పోలిస్తే మార్కెట్ లాభాల్లోనే ప్రారంభమైంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ ప్రకటన తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 116 పాయింట్ల నష్టంతో 74,243 వద్ద ముగియగా.. నిఫ్టీ 49 పాయింట్ల నష్టంతో 23,366 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.94 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌యూఎల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు రాణించాయి. హిందాల్కో, విప్రో, ట్రెంట్, కోల్ ఇండియా, టీసీఎస్ షేర్లు నష్టపో యాయి.రూపాయిని బలోపేతం చేసేలా దేశంలోకి డాలర్ల రూపంలో పెట్టుబడులు రప్పించే ఉద్దేశంతో కేంద్రం



ఎల్‌టీసీజీ పన్నును తొలగించింది. అదే సమయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నామని, రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నామని ఆర్‌బీఐ వెల్లడించింది. దీంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి.




# అసంఘటిత రంగంలో డిజిటల్ వెలుగు

- 76% పెరిగిన ఉత్పాదకత
- సగటు వేతనాల్లో మెరుగ్గా తెలంగాణ
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

దేశంలో అసంఘటిత రంగ సంస్థల రూపురేఖలను డిజిటలీకరణ అనూహ్యంగా మారుస్తోంది. సాంకేతికత అందిపుచ్చుకోవడం ద్వారా ఈ సంస్థల కార్మిక ఉత్పాదకత భారీగా పెరగడమే కాకుండా, సంఘటిత వ్యవస్థలోకి మారే ప్రక్రియ వేగవంతం అవుతోందని ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. అసంఘటిత రంగ సంస్థల వార్షిక సర్వే-2025 ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక, జాతీయ స్థాయి గణాంకాలతో పాటు, తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల పనితీరు మెరుగవ్వడాన్నీ స్పష్టం చేసింది. సాంకేతికతను స్వీకరించడంతో, అసంఘటిత కార్మికుల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతోంది. ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) సూచీలో ఒక పర్సంటేజీ పాయింట్ పెరుగుదల నమోదైతే, కార్మిక ఉత్పాదకత ఏకంగా 76% పెరుగుతున్నట్లు ఎస్‌బీఐ పరిశోధనలో తేలింది. ఉత్పాదకతను పెంచడంలో సాంకేతికతతో పాటు, సంస్థల అనుభవం 11%, మూలధనం 7% మేర వృద్ధికి దోహదం చేస్తున్నాయి.దేశవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులకు చెల్లించే సగటు వార్షిక వేతనం 2022-23లో రూ.1.25 లక్షలు కాగా, 2025 నాటికి రూ.1.46 లక్షలకు చేరింది. ఈ



విషయంలో తెలుగు రాష్ట్రాలు జాతీయ సగటుకంటే ముందున్నాయి. ఈ రంగ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో (ఉత్తరాఖండ్, కేరళం తర్వాత) నిలిచింది. ఇక్కడి కార్మికులకు సగటున రూ.1,90,390 చెల్లిస్తున్నారు. దేశ స్థూల విలువ (జీవీఏ) జోడింపులో తెలంగాణ అసంఘటిత రంగ వాటా 4.6 శాతంగా, మొత్తం కార్మికుల్లో రాష్ట్ర వాటా 3.9 శాతంగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ కార్మికులకు మెరుగైన వేతనాలు లభిస్తున్నాయి. ఇక్కడి వార్షిక సగటు వేతనం రూ.1,53,888గా ఉంది. జాతీయ స్థాయి జీవీఏలో ఏపీ అసంఘటిత రంగం వాటా 4.4%, కార్మికుల వాటా 3.6 శాతంగా ఉంది. ఇంటర్నెట్ వినియోగంలోనూ తెలుగు రాష్ట్రాలు గణనీయ వృద్ధి నమోదు చేస్తున్నాయి.

**‘ఉద్యమ్’ స్థాయిలో నమోదు**

డిజిటలీకరణ వల్ల సంస్థలు అధికారికంగా నమోదు (రిజిస్టర్) అయ్యే అవకాశాలు సగటున 84% పెరుగుతున్నాయి. రంగాల వారీగా చూస్తే.. తయారీలో 64%, వాణిజ్య రంగంలో 82%, ఇతర సేవల విభాగంలో 86% రిజిస్ట్రేషన్ అవకాశాలు మెరుగుపడినట్లు నివేదిక తేల్చింది. నమోదైన సంస్థలకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశం మిగతా వాటికంటే 6.9% ఎక్కువగా ఉంటోంది. నమోదుకాని సంస్థలకు సగటున రూ.3 లక్షల రుణం అందితే, నమోదైన వాటికి రూ.5.5 లక్షలు, ఉద్యమ్ ద్వారా నమోదైన వాటికి సగటున రూ.10 లక్షల వరకు రుణం అందుతోంది. ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన సంస్థలు 41% అధికంగా రుణం పొందగలుగుతున్నాయి.

**మహిళా పారిశ్రామికవేత్తలకు భరోసా**

పురుషులతో పోలిస్తే, మహిళా యజమానులకు అధికారిక రుణాలు పొందే అవకాశం 2.44% తక్కువగా ఉన్నా, ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు ద్వారా ఈ లోటును భర్తీ చేయొచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకున్న మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు పొందే అవకాశం 5.6% పెరుగుతోంది. నమోదు కాని మహిళా పారిశ్రామికవేత్తలకు సగటున రూ.75,000 రుణం లభిస్తుంటే, నమోదైన సంస్థలకు రూ.5 లక్షల వరకు రుణం వస్తుండటం గమనార్హం.

# అమెరికాకు అండగా మనోళ్లు

## 96 యూనికార్న్ స్టార్టప్‌ల్లో మనోళ్లే..!



**న్యూఢిల్లీ:**అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కిన నాటినుంచి వలసదారులపై కక్షకట్టారు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఏలియన్లు అంటూ, అమెరికన్ల ప్రయోజనాలను దెబ్బతిస్తున్నారంటూ ఎప్పటికప్పుడు వలసదారులపై ఆయన నోరుపారేసుకుంటూనే ఉన్నారు. కానీ, వాస్తవంలో మాత్రం ట్రంప్ ఆరోపణలన్నీ కాకి లెక్కలేనని గణాంకాలు చెబుతున్నాయి. అగ్రరాజ్యంలోని ప్రైవేట్ స్టార్టప్ యూనికార్న్‌ల్లో సగానికి పైగా వలసదారుల భాగస్వామ్యంతో నెలకొల్పినవేనని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. వీరిలో అత్యధికం భారత సంతతికి చెందినవారే కావడం గమనార్హం.‘ఇమిగ్రెంట్స్ అండ్ యూఎస్ బిలియన్ డాలర్ కంపెనీస్’ పేరుతో నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ అధ్యయనం జరిపి నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం.. అగ్రరాజ్యంలో మొత్తం 775 స్టార్టప్ యూనికార్న్‌లు ప్రైవేట్ అధీనంలో ఉండగా.. వీటిల్లో 59శాతం అంటే 455 కంపెనీలకు వలసదారులే వ్యవస్థాపకులు లేదా సహ వ్యవస్థాపకులుగా ఉన్నారు. ఈ స్టార్టప్ కంపెనీల మొత్తం విలువ 5 ట్రిలియన్ డాలర్లకు పైనే ఉంది. ఇక, వీటిలో అత్యధికంగా 96 యూనికార్న్‌ల్లో భారత మూలాలున్న వ్యాపారవేత్తల భాగస్వామ్యం ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. అందులో ఒకటి పర్‌ప్లెక్సిటీ ఏఐ సంస్థ. భారత్ సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ దీనికి సహ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. 20 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఈ స్టార్టప్ సంస్థ యూనికార్న్‌ల్లో 12వ ర్యాంక్‌లో నిలిచింది.భారత్ తర్వాత.. 60 స్టార్టప్ యూనికార్న్‌ల్లో భాగస్వామ్యంతో ఇజ్రాయెల్ ఈ జాబితాలో రెండో స్థానంలో ఉంది. యూకే (47), చైనా (41), కెనడా (30), రష్యా (23), ఫ్రాన్స్ (21), జర్మనీ (18), ఉక్రెయిన్ (16), ఆస్ట్రేలియా (14) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వలసదారుల వ్యవస్థాపక భాగస్వామ్యంతో నెలకొల్పిన ఈ బిలియన్ డాలర్ల స్టార్టప్‌లు సగటున 833 ఉద్యోగాల చొప్పున సృష్టించాయని అధ్యయనం వెల్లడించింది. ఇక, అమెరికాలోని 80శాతం యూనికార్న్‌ల్లో వలసదారులు వ్యవస్థాపక సభ్యులుగా లేదా సీఈఓ వంటి కీలక నాయకత్వ హోదాల్లో ఉన్నారు.కనీసం 15 మంది వలసదారులు రెండు లేదా అంతకంటే ఎక్కువ యూనికార్న్‌లను స్థాపించారు. భారత సంతతికి చెందిన మోహిత్ అరోన్, జ్యోతి బన్సాల్, అషుతోష్ గార్గ్, అరవింద్ జైన్, సచిన్ నాయర్, అజీత్ సింగ్ ఈ జాబితాలో ఉన్నారు. దక్షిణాఫ్రికా మూలాలున్న ఎలాన్ మస్క్ నాలుగు కంపెనీలకు ఫౌండర్/కో-ఫౌండర్‌గా ఉన్నారు. స్పేస్‌ఎక్స్, ఓపెన్ ఏఐ, ది బోరింగ్ కంపెనీ, న్యూరాలింక్‌ల్లో ఈయన భాగస్వామ్యం ఉంది. ఒక, ప్రైవేటు స్టార్టప్ సంస్థ స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అవ్వకుండా.. బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను దాటితే దాన్ని ‘యూనికార్న్’గా అభివర్ణిస్తారు.

# భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుకు ఎయిర్‌ట్రంక్ భారీ పెట్టుబడి

**న్యూఢిల్లీ:**బ్లాక్ స్టోన్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్‌కు చెందిన ఎయిర్‌ట్రంక్ సంస్థ భారత్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ పెట్టుబడిని ప్రకటించింది. భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 30 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. 2030 నాటికి 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లను అభివృద్ధి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్ ఖుదా భారత్ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అంశాల్లో ఇలాంటి పెట్టుబడులు భారత్‌ను గ్లోబల్ హబ్‌గా నిలుపుతాయని ప్రధాని మోదీ ‘ఎక్స్’లో పేర్కొన్నారు. భారతదేశాన్ని గ్లోబల్ ఏఐ పవర్‌హౌస్‌గా మార్చాలనే ప్రధాని విజన్‌కు ఈ పెట్టుబడి మద్దతుగా నిలుస్తుందని రాబిన్ ఖుదా పేర్కొన్నారు. ఈ పెట్టుబడి వల్ల స్థానికంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. రహదారులు, పోర్టులు, పవర్ నెట్‌వర్కులు ఏవిధంగా దేశ ఆర్థిక వృద్ధికి అవసరమో.. డిజిటల్ మౌలికవసతులు కూడా అంతే అవసరమని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.

# ఆ దాడి సమయంలో ఖమేనీ ఆఫీస్‌లోనే ఉన్నా: అబ్బాస్ అరాగ్చీ

**న్యూఢిల్లీ:**అమెరికా-ఇజ్రాయెల్ ఫిబ్రవరి 28న ఇరాన్‌పై జరిపిన దాడిలో నాటి సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, ఆ దాడి సమయంలో తాను సుప్రీం లీడర్ కార్యాలయంలోనే ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్ కేంద్రంగా పనిచేసే ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన.. దాడి అనంతరం ఖమేనీ ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక తీవ్ర ఆందోళన చెందానని చెప్పారు.“జెనీవాలో కీలక దౌత్య చర్చలు ముగించుకొని వచ్చా. ఆ వెంటనే నివేదిక ఇవ్వడానికి మరుసటి ఉదయం ఖమేనీ కార్యాలయానికి వెళ్లా. నేను ఆ భవనంలో ఉండగానే దాడి జరిగింది. తాము కూర్చున్న విభాగం కూడా దెబ్బతింది. శిథిలాల నుంచి బయటకు వస్తున్నప్పుడు నా ఆలోచనంతా సుప్రీం లీడర్‌పైనే. నా గురించి పట్టించుకోలేదు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక రెండు రోజులు తీవ్ర ఆందోళన చెందా” అని అబ్బాస్ అరాగ్చీ గుర్తు చేసుకున్నారు.అమెరికా, ఇజ్రాయెల్‌ల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలని అంతకుముందే సుప్రీం లీడర్‌కు సూచించినప్పటికీ అందుకు ఆయన నిరాకరించారని అరాగ్చీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులందరికీ రక్షణ కల్పించే వరకు తాను ఎక్కడికీ వెళ్లనని స్పష్టం చేశారు. తన ప్రజలకు ఏది జరిగితే.. తనకూ అదే జరుగుతుందని ఖమేనీ చెప్పినట్లు పేర్కొన్నారు.ఇరాన్‌పై దాడులకు అమెరికా సైనిక స్థావరాలను ఉపయోగిస్తే ప్రతీకార చర్యలు తప్పవని గల్ఫ్ దేశాలను ముందుగానే హెచ్చరించామని అరాగ్చీ వెల్లడించారు. పొరుగు దేశాల్లో అమెరికా స్థావరాలు లేకుంటే.. వాటిపై ప్రతీకార దాడులు ఉండేవి కావన్నారు. తమ భూభాగాన్ని ఈ విధంగా వినియోగించడాన్ని ఆయా ప్రభుత్వాలు వ్యతిరేకించినప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా అమెరికా ముందుకు వెళ్లిందన్నారు.

# రజనీకాంత్ తనతో చేతులు కలపమన్నారు: అన్నామలై

**న్యూఢిల్లీ:**తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. “2024లో నేను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించుకునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను” అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తాను. ప్రధాని మోదీపై నాకు అపారగౌరవం ఉంది. భాజపా ఇప్పటివరకు నాపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన అవకాశాలకు కృతజ్ఞతలు” అని అన్నామలై వెల్లడించారు.

# చలామణిలోకి పాలిమర్ కరెన్సీ నోట్లు..

## ఆర్‌బీఐ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ:**పాలిమర్ కరెన్సీ నోట్లపై ఆర్‌బీఐ కీలక ప్రకటన చేసింది. ఈ నోట్లను చలామణిలోకి తెచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని చెప్పారు.కాగితపు కరెన్సీకి ఉన్న గిరాకీ నేపథ్యంలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ముద్రించాలన్న ఆలోచనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పదేళ్ల క్రితమే ప్రతిపాదించింది. కాగితపు కరెన్సీని ముద్రించడానికి అయ్యే వ్యయం, నోట్లు చేతులు మారే క్రమంలో అవి పాడైపోవడం వంటి వాటిని దృష్టిలోఉంచుకొని అప్పట్లో ఆర్‌బీఐ ఆ ప్రతిపాదన చేసింది. దేశవ్యాప్తంగా ట్రయల్ పద్ధతిలో రూ.10 విలువైన ఒక బిలియన్ ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ సమయంలో పార్లమెంట్‌కు కేంద్రం తెలియజేసింది. అందుకు కొచ్చి, మైసూర్, జైపుర్, శిమ్లా నగరాలను ఎంచుకుంది. అయితే సాంకేతిక, కార్యాచరణ సమస్యల కారణంగా ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. మరోవైపు.. మార్కెట్‌లో నకిలీ నోట్ల చలామణి స్వల్పంగా పెరగడంతో, వాటిని అరికట్టేందుకు, నోట్ల మన్నికను పెంచేందుకు ఆర్‌బీఐ నోట్లలో కొత్త సెక్యూరిటీ ఫీచర్లతో పాటు, వార్నిష్డ్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల వెల్లడైన వార్షిక నివేదికలో ఆర్‌బీఐ ఈ విషయాన్ని ప్రస్తావించింది. పలుచని, రక్షిత అల్ట్రా వయొలెట్ క్యూర్డ్ వార్నిష్ పూత పూసిన కాగితపు నోట్లనే వార్నిష్ కరెన్సీగా పిలుస్తారు. తరచూ నోట్లు పాడై, కొత్తవి ముద్రించేందుకు అవుతున్న ఖర్చు తగ్గించేందుకు ఇవి ఉపయోగపడతాయి. సాధారణ నోట్లతో పోలిస్తే, ఇవి 2-3 రెట్లు అధిక కాలం మన్నుతాయన్నది అంచనా.

# రూ.15 లక్షల కోట్లు ఎక్కడున్నాయ్!

- ఖాతాల్లో ఎక్కువ చేసి చూపిన రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్
- అనుబంధ కంపెనీల్లోనే 99.8% ఆదాయం
- ఆడిటెడ్ గణాంకాలకు, ఆదాయాలకు భారీ అంతరం
- ఛైర్మన్, సీఈఓ రాజేశ్ మెహతాపై సెబీ నిషేధం

పసిడి రిఫైనర్, ఆభరణాల తయారీ సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్, గత అయిదేళ్లలో తన ఏకీకృత ఆదాయాలను రూ.15 లక్షల కోట్లకు పైగా ఎక్కువ చేసి చూపిందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పేర్కొంది. తన విదేశీ అనుబంధ కంపెనీల్లో.. ముఖ్యంగా స్విట్జర్లాండ్‌కు చెందిన వాల్కంబి ఎస్‌ఏకేలో అధిక ఆదాయం చూపిందని తెలిపింది. అయితే వాల్కంబి స్టాండలోన్ ఆర్థిక గణాంకాల్లో, అతి తక్కువ మొత్తమే నమోదైందని సెబీ వివరించింది. ఈ నేపథ్యంలోనే కంపెనీ ప్రమోటరు, ఛైర్మన్, సీఈఓ రాజేశ్ మెహతాను కంపెనీ సెక్యూరిటీస్‌ల నిర్వహణ చేయకుండా నిషేధం విధిస్తున్నట్లు సెబీ ప్రకటించింది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్థిక పరిస్థితిని పూర్తిగా తప్పుదోవ పట్టించేలా గణాంకాలు చూపుతున్నారు. 2020-21 నుంచి 2024-25 మధ్య ఏకీకృత ఆదాయాలు రూ.15.18 లక్షల కోట్లుగా కంపెనీ చూపించింది. అందులో రూ.15.15 లక్షల కోట్ల (99.8%) ఆదాయం అనుబంధ కంపెనీల ద్వారా వచ్చినట్లు పేర్కొంది. అయితే వాల్కంబి ఎస్‌ఏకు చెందిన ఆడిటెడ్ స్టాండలోన్ ఆర్థిక గణాంకాలకు అవి సరిపోవడం లేదు. కేపీఎమ్‌జీ ఎస్‌ఏ చేసిన ఆడిట్‌లో కేవలం ప్రాసెసింగ్ ఛార్జీలు, వేల్యూ అడిషన్‌నే ఆదాయంగా ఆ సంస్థ చూపించింది. ఉదాహరణకు 2023లో వాల్కంబి ఎస్‌ఏ స్టాండలోన్ ఆదాయం రూ.543 కోట్లుగా ఉండగా, రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్, దాని ఇంటర్మీడియరీ హోల్డింగ్ కంపెనీ అయిన గ్లోబల్ గోల్డ్ రిఫైనరీస్(జీజీఆర్) ఏకీకృత ఆదాయాలు వరుసగా రూ.2.93 లక్షల కోట్లు, రూ.2.81 లక్షల కోట్లుగా రిపోర్ట్ చేసింది. అంటే ఏకీకృత స్థాయిలో చెప్పిన ఆదాయాల్లో 0.5% కంటే తక్కువగా మాత్రమే వాల్కంబి స్టాండలోన్ ఆదాయాలున్నాయి. ఎటువంటి స్వతంత్ర నిర్వహణ కార్యకలాపాలు లేని ఒక హోల్డింగ్ కంపెనీ, తన అనుబంధ కంపెనీ ద్వారా ప్రాసెసింగ్ ఫీజును ఆదాయంగా పొందే కంపెనీ నుంచి లక్షల కోట్ల రూపాయల్లో ఆదాయం ఎలా పొందిందని సెబీ ప్రశ్నించింది. ఈ విషయంలో రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సరైన డాక్యుమెంటరీ సాక్ష్యాలు, అకౌంటింగ్ ఒపీనియన్లు, బులియన్ యాజమాన్య రికార్డులు, అంతర్ కంపెనీ ఒప్పందాలు.. తదితరాలను సమర్పించడంలో విఫలమైందని సెబీ తెలిపింది. ఈ నేపథ్యంలోనే కంపెనీ సెక్యూరిటీస్‌ల నిర్వహణ చేయకుండా కంపెనీ ప్రమోటరు, ఛైర్మన్, సీఈఓ రాజేశ్ మెహతాపై నిషేధం విధించింది.రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ స్థిరంగా బలమైన ఆర్థిక పనితీరు గణాంకాలు చూపుతున్నా.. షేరు ధరలో అవి ప్రతిఫలించడం లేదని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఫిబ్రవరిలో రూ. 1,028.40 వద్ద గరిష్ఠ స్థాయిని తాకిన ఈ కంపెనీ షేరు ధర క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2026 ఏప్రిల్ 2 నాటికి రూ.80.11కు పరిమితమైంది. తర్వాత కాస్త పుంజుకుంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో గురువారం మళ్లీ లోయర్ సర్క్యూట్‌కు చేరింది. బీఎస్‌ఈలో 4.99% నష్టంతో రూ.104.65 వద్ద స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ.3,089 కోట్లకు పరిమితమైంది. ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీకి, ఈ కంపెనీలో మార్చి చివరకు 10.8% వాటా ఉంది. అలాగే 1,94,110 మంది రిటెయిల్ మదుపర్లకు 14.13% వాటాలున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
6 జూన్ 2026

# నగరాభివృద్ధిలో 'ఈజ్ ఆఫ్ లివింగ్'కూ ప్రాధాన్యం ఇవ్వాలి

- ట్యాంక్‌బండ్‌పై 'సేవ్ హైదరాబాద్' మానవహారం
- నగరీకరణకు తగ్గట్లుగా మౌలిక వసతులు లేవన్న నాగేశ్వర్
- హుస్సేన్‌సాగర్, మూసీ శుద్ధిపై ఆచరణాత్మక చర్యలు అవసరం
- కాలుష్య నియంత్రణకు పౌర సంస్థలు ముందుకు రావాలి




**ముషీరాబాద్, జూన్ 5 (జనంసాక్షి):**
వేగంగా పెరుగుతున్న నగరీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదని, ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ఇస్తున్న ప్రాధాన్యతను 'ఈజ్ ఆఫ్ లివింగ్'కు కూడా ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్) ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై 'సేవ్ హైదరాబాద్' నినాదంతో నిర్వహించిన మానవహార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాల్లో గాలి, వెలుతురు సమృద్ధిగా వచ్చే విధంగా ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అలాంటి నిర్మాణాల వల్ల విద్యుత్ వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజా రవాణా, సుస్థిర మొబిలిటీ వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా శిలాజ ఇంధనాల వినియోగం తగ్గించి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. భూగర్భ జలాలు, గాలి, నీటి వనరులు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, డ్రైనేజీ నీటిని యథేచ్ఛగా చెరువుల్లోకి వదలడం వల్ల మంచినీటి వనరులు కలుషితమవుతున్నాయని అన్నారు. హుస్సేన్‌సాగర్, మూసీ నది శుద్ధి కార్యక్రమాల గురించి ఎన్నో ఏళ్లుగా వింటున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అమలు జరగడం లేదని వ్యాఖ్యానించారు. నగరాభివృద్ధి పర్యావరణ హితంగా సాగితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక వ్యవస్థకు కూడా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు.
అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి 100 మంది జనాభాకు కనీసం 100 చెట్లు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అయితే హైదరాబాద్‌లో చెట్ల సంఖ్య ఆ స్థాయికి చాలా దూరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది ఎండల తీవ్రత పెరుగుతుండటం కాలుష్య స్థాయిలు పెరుగుతున్నాయనే విషయాన్ని సూచిస్తోందన్నారు. నగర ప్రణాళికలో సమగ్ర మార్పులు తీసుకురావాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.
కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ కార్యదర్శి కె. వీరయ్య, ఉపాధ్యక్షుడు మల్లం రమేష్‌లు గ్లోబల్ వార్మింగ్ నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, హుస్సేన్‌సాగర్-మూసీ శుద్ధి, కాలుష్య నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించే ప్లకార్డులను ప్రదర్శించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు ఆర్. మాణిక్‌తో పాటు హెచ్‌సీఎఫ్ కార్యకర్తలు, పర్యావరణ ప్రేమికులు, పౌరసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీజ్ చేసిన ఎస్‌ఓటి పోలీసులు..
# ఖతం చేసిన కానిస్టేబుల్



### సిజ్ చేసిన రేషన్ బియ్యం ఇంటికి తీసుకెళ్లిన వైనం

### మధ్యలోనే ఖాతమైయ్యాయి జనంసాక్షి ప్రతినిధితో కానిస్టేబుల్ ప్రహ్లాద్..

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : ఎక్కడైనా దొంగతనం జరిగినప్పుడు మరింకేదైన చోరీ జరిగినప్పుడు అక్కడ చట్ట ప్రకారం పోలీసులు వాలిపోతారు జరిగిన ఘటనపై తమదైన శైలిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తారు దొంగతనానికి పాల్పడిన వారిని పోలీసులు పట్టుకుంటారు బాధితులకు న్యాయం చేస్తారు కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగింది ఎస్ఓటి పోలీసులు రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తే ఆ రేషన్ బియ్యాన్ని మాత్రం లాండ్ ఆర్డర్ కానిస్టేబుల్ మధ్యలోనే ఖాతం చేసినట్లు ఆయన మాటలతోనే ఒప్పుకున్నాడు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని జిల్లేడ్ చౌదర్ గూడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల మార్చి 17వ తేదీన ఎస్ఓటి పోలీసులు వేపకుచ్చ తాండాకు చెందిన సంతోష్ నాయక్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బొలెరో వాహనంలో పూణేకు తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఓటి పోలీసులు పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు అక్కడి నుండి సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని షాద్ నగర్ సివిల్ సప్లై గోదాముకు తరలిస్తున్న క్రమంలో కొందుర్గు మండల కేంద్రానికి బొలెరో వాహనం చేరుకున్నాక రెండు బియ్యం బస్తాలు (క్వింటాల్) బియ్యని బొలెరో వాహనంలో ఉన్న కానిస్టేబుల్ ప్రహ్లాద్ కొందుర్గ్ లో ఓ మెకానిక్ షాపు తో పాటు ఓ సిమెంట్ షాప్ లో బోలెరా వాహనంలో నుండి బియ్యాన్ని దింపించేశాడు ఆ తర్వాత ఆ బియ్యాన్ని తన ఇంటికి తీసుకెళ్లినట్లు షాప్ నిర్వాహకులు చెప్పుకొచ్చారు విషయం తెలుసుకోవడానికి జనంసాక్షి ప్రతినిధి కానిస్టేబుల్ ప్రహ్లాద్ కు ఫోన్ చేయగా అవును ఆరెండు బియ్యం బస్తాలతో పాటు మరో నాలుగు కూడా మధ్యలోనే ఖాతమైయ్యాయని చెప్పుకొచ్చారు ..

**ధర్మకాంట వద్ద బియ్యం బస్తాలను దింపివేశాం : సంతోష్ బొలెరా వాహన డ్రైవర్**
జిల్లేడ్ చౌదర్ గూడ పోలీస్ స్టేషన్ నుంచి బొలెరో వాహనంలో సీజ్ చేసిన బియ్యం బస్తాలను డైరక్ట్‌గా గోదాంకు తీసుకపోకుండా షాద్ నగర్ పట్టణం లోని మహబూబ్ నగర్ రోడ్డులో ఓ ధర్మకాంటా దగ్గర తూకం చేయించే ముందు రెండు బియ్యం బస్తాలను (క్వింటాల్) బొలెరో వాహనంలో నుండి దింపి తర్వాత తూకం చేయించారూ కానిస్టేబుల్ ప్రహ్లాద్ మళ్లీ తిరిగి సివిల్ సప్లై గోదాం దగ్గర బియ్యం బస్తాలను గోదాంలో దింపిన తర్వాత రిటర్న్ లో ధర్మకాంట దగ్గరికి వెళ్లి బొలెరా వాహనంలోనే ఆ రెండు బియ్యం బస్తాలను తెచ్చి కొందుర్గులోని ఓ బైక్ మెకానిక్ షాపులో దింపగా అక్కడనుండి సిమెంట్ షాప్ కి తీసుకెళ్లి అక్కడి నుండి కానిస్టేబుల్ ఇంటికి తీసుకెళ్లాడని బైక్ మెకానిక్ షాప్‌తో పాటు సిమెంట్ షాప్ నిర్వాహకులు మాకు తెలిపారు..

**మరో నాలుగు కూడా ఖాతం చేశాం : కానిస్టేబుల్ ప్రహ్లాద్**
జరిగిన తతంగంపై కానిస్టేబుల్ ప్రహ్లాద్ ను జనంసాక్షి ప్రతినిధి ఫోన్లో వివరణ కోరగా ఆ రెండు బియ్యం బస్తాలతో పాటు మరో నాలుగు బస్తాలు కూడా మధ్యలోనే ఖాతామైయ్యాయని ఈ విషయం మీకు చెప్పినవాళ్లు ఆ విషయం మీకు చెప్పలేదా అంటూ అసలు మీరు ఎందుకు కాల్ చేస్తున్నారు ఆ విషయం గురించి మీకు ఎందుకు అంటూ చెప్పుకొచ్చాడు...

# నకిలీ జీవోలతో ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర

### మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్



**రాజేంద్రనగర్,జూన్5(జనంసాక్షి) :** గండిపేట మండలంలోని సర్వే నెం.18లో ఉన్న సుమారు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, ఇతర నకిలీ పత్రాల ఆధారంగా కబ్జా చేసేందుకు కుట్ర పన్నిన కేసులో ఏపీ పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈవోడబ్ల్యూ) పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల కుటుంబ సభ్యులు, రాధాకృష్ణ, ప్రభీన్ కుమార్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా భూమి కబ్జా కుట్ర కోసం సుమారు రూ.12 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. బొల్లా బ్రహ్మనాయుడు ఈ కుట్రలో భాగంగా నిమ్మల కుటుంబ సభ్యులకు రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతర సంబంధిత వ్యక్తులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ నిధులను నకిలీ జీవోలు, నకిలీ ప్రభుత్వ అనుమతులు, తప్పుడు పత్రాల తయారీ ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు వినియోగించినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టుకు ముందు బొల్లా బ్రహ్మనాయుడు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, కేసు తీవ్రత, దర్యాప్తు దశ, ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం అతని బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ కేసులో ఇతర వ్యక్తుల పాత్ర, నకిలీ పత్రాల తయారీ వెనుక ఉన్న ముఠా, ఆర్థిక లావాదేవీలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పాఠశాల విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెరగాలి

- పర్యావరణ పరిరక్షణకు అవగాహనే తొలి అడుగు
- తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ డా. ప్రియాంకా వర్గీస్




**హైదరాబాద్ :** పాఠశాల విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెరగాలని... పర్యావరణ పరిరక్షణకు అవగాహనే తొలి అడుగు అని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్, సీసీఎఫ్ డా. ప్రియాంకా వర్గీస్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ (టీజీఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పులపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (సీసీఎఫ్) డా. ప్రియాంకా వర్గీస్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడాలంటే చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చుకుని, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అడవులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం, ప్రకృతి సమతుల్యత పరిరక్షణ ప్రాధాన్యంపై విద్యార్థులకు వివరించారు. డా. ప్రియాంకా వర్గీస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం, జీవ వైవిధ్యం తగ్గిపోవడం వంటి సమస్యలు తీవ్ర సవాళ్లుగా మారాయని అన్నారు. సహజ వనరుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి సంరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. అటవీ అకాడమీ అధ్యాపకులు కూడా విద్యార్థులతో మమేకమై పర్యావరణ విద్య ప్రాముఖ్యతను వివరించారు. పచ్చని, పరిశుభ్రమైన, స్థిరమైన భవిష్యత్తు నిర్మాణంలో పర్యావరణ అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముగింపులో విద్యార్థులు మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యల ద్వారా ప్రకృతి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



గతంలో పెట్రోల్ ట్యాంకర్ పేలిన ఫైల్ ఫోటో

# నిఘా నిల్.. దందా ఫుల్

## ఇం'ధన' చోరీ వెనుక ఉన్నది ఎవరో..!?

- ఓ స్థానికుడే పూర్తి సహకారంగా ఉన్నట్టు సమాచారం
- అడ్డాల సమాచారం అందించినా చర్యలు శూన్యం
- అధికారుల పాత్రపైనా అనేక అనుమానాలు

**బోడుప్పల్/మేడిపల్లి, జూన్ 5 (జనంసాక్షి) :**
మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి, నాచారం, చర్లపల్లి, మల్లాపూర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో అక్రమ ఇంధన దందా కొనసాగుతోందనే ఆరోపణలు స్థానికంగా గుప్పుమంటున్నా యి. ట్యాంకర్ల నుంచి ఇంధనం మళ్లింపు, రహస్య నిల్వ కేంద్రాలు, అనధికార విక్రయాలపై ఎప్పటికప్పుడు చర్చ జరుగుతున్నప్పటికీ, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇంధన నిల్వలు, ట్యాంకర్ల రాకపోకలు, రహస్య కేంద్రాల కార్యకలాపాలపై స్థానికులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉన్న ప్రాంతాల్లోనే సంబంధిత నిఘా వ్యవస్థలు, పర్యవేక్షణ యంత్రాంగం ఎంత మేరకు పనిచేస్తున్నాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**దాడులు, కేసులు దిగదుడుపే..**
అక్రమ ఇంధన కేంద్రాల వద్దకు వివిధ వాహనాలు, రాకపోకలు సాగుతున్నట్లు స్థానికులు గమనిస్తుండగా.. అధికార యంత్రాంగంలో మాత్రం చలనం లేదనే విమర్శలు వస్తున్నాయి. పలుమార్లు దాడులు, కేసులు నమోదైనట్టే అనిపిస్తున్నప్పటికీ అక్రమంగా కొనసాగుతున్న ఇంధన దందాకు అడ్డుకట్ట పడటం లేదు. దీంతో ఎసఓటీ, టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల నిఘా వ్యవస్థల పనితీరుపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పదేపదే ఆరోపణలు వస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగాలు, సంబంధిత శాఖలు సంయుక్తంగా స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలకు తెరపడాలంటే సంబంధిత శాఖలు పారదర్శకంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

**కండ్ల ముందే 2018 ఘటన**
2018, జనవరి 12న మేడిపల్లి చౌరస్తా చెంగిచెర్ల వెళ్లేదారిలో ఓ ట్యాంకర్ అమాంతం గాల్లోకి ఎగిరి పడిన భయనక ఘటన గుర్తుండే ఉంటుంది. ట్యాంకర్ల నుంచి పెట్రోల్ తీస్తుండగా మంటలు చెలరేగడంతో మరో ట్యాంకర్ కు అంటుకుని ఈ ప్రమాదం సంభవించింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, పాదచారులు దాదాపు 12 మంది గాయపడ్డారు. ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించగా.. తాజాగా మళ్లీ అలాంటి భయాందోళనే వ్యక్తమవుతున్నాయి. నివాస ప్రాంతాల్లో ట్యాంకర్ల నిల్వ చేస్తుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. మల్లాపూర్ గోకుల్‌నగర్, బోడుప్పల్ మై హోం పక్కన యధావిధిగా దందా కొనసాగుతోంది.




**వెలుగుచూడని చీకటి కోణాలు**
ఇంధన మాఫియా గురించి కిందిస్థాయి వరకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు చేపట్టడం లేదు. కొందరు అధికారులకు వివరాలు అందించినప్పటికీ తాత్కాలిక చర్యలతో మమ అనిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో పోలీసులు, ప్రత్యేక నిఘా విభాగాలు, టాస్క్‌ఫోర్స్ బృందాల పనితీరుపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది పెద్దల అండదండలు ఉన్న కారణంగానే ఎవరూ దానిపై పట్టించుకోవడం లేదని గుసగుసలూ వినిపిస్తున్నాయి. అందుకే రహస్య దందా వివరాలు బయటకు పొక్కడం లేదని స్పష్టమవుతోంది. అయితే గత కొన్నేళ్లుగా అనేక ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అందులో ఎంతవరకు వాస్తవమన్నది సమగ్ర విచారణ ద్వారానే తేలాల్సి ఉంది.

# పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

**పెద్దపల్లి,జూన్ 05(జనంసాక్షి) :** జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ తెలుగు పరీక్షలు నిర్వహించామని,ఈ పరీక్షకు (43) మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, (33) మంది విద్యార్థులు హాజరయ్యారని, 76.74 శాతం హాజరు నమోదు అయ్యిందని తెలిపారు.




# తేజాస్ అకాడమీ నుండి డిఫెన్స్ రంగంలో 160 మంది ఉద్యోగాలకు ఎంపిక

- 160 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో మెరిట్
- తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సిహెచ్. సతీష్ రావు

**కరీంనగర్ బ్యూరో, జూన్ 05 (జనంసాక్షి) :**
కొత్తపల్లిలోని మా తేజాస్ డిఫెన్స్ అకాడమీ నుండి 160 మంది విద్యార్థులు డిఫెన్స్ ఉద్యోగాలు సాధించడం జరిగిందని తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సిహెచ్. సతీష్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ... మా తేజాస్ అకాడమీ నుండి డిఫెన్స్ రంగం లో 160 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనారని తెలిపారు. వివరాల్లోకెళ్తే 156 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీ లో ముగ్గురు (3) విద్యార్థులు, ఇండియన్ ఎయిర్ఫోర్స్ లో అగ్నివీరులుగా ఎంపిక కావడం జరిగిందని, ఇండియన్ ఆర్మీ జిడి - 131, ట్రేడస్మెన్ -12, టెక్నికల్ -13, క్లర్క్ -1, ఇండియన్ ఎయిర్ఫోర్స్ లో నాన్ - టెక్నికల్ -3 ఉద్యోగాలు సాధించడం జరిగిందని తెలిపారు. వీరు ఇండియన్ ఆర్మీ జూన్ 2025 హన్మకొండ ఆర్మీ ఓపెన్ ర్యాలిలో పాల్గొని మెరిట్ సాధించి, 31 మే 2026 న వచ్చిన మెరిట్ లో అగ్నివీరులుగా ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందని, అలాగే 2026 జూన్ 01 న వచ్చిన ఇండియన్ ఎయిర్ఫోర్స్ మెరిట్ లిస్ట్ లో ముగ్గురు అగ్నివీరులుగా ఎంపిక కావడం జరిగిందని, ఈ సంధర్భంగా తేజాస్‌లో "తేజాస్ షార్య 2026" ప్రోగ్రాం ఏర్పాటు చేసి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ సతీష్ రావు అభినందించి జ్ఞాపికలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు
తేజాస్ అకాడమీలో రాష్ట్ర స్థాయి మార్కులు అనగా ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి ఇయర్‌లో 470 కి గాను 468, 467, 467, 466, 466, ఎంపీసీ సెకండ్ ఇయర్ లో 1000 గాను 993, 992, 992, 992 , సిఈసి మొదటి ఇయర్ 500 గాను 490, 483, సిఈసి సెంకండ్ ఇయర్ లో 1000 గాను 973, 972 మార్కులు, మొదటి ఇయర్ బైపీసీలో 440 గాను 436, 426. బైపీసీ సెకండ్ ఇయర్ లో 1000 గాను 969, 954 వంటి రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు సాధిస్తూ, ప్రతి నోటిఫికేషన్‌లో తెలంగాణలోనే అత్యధిక ఉద్యోగాలు సాధిస్తూ, 2000 కు పైగా విద్యార్థులను ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దడం జరిగిందని, వరుసగ అన్ని నోటిఫికెషన్స్‌లో మా అకాడమి నుంచి విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం జరుగుతుందని తేజాస్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు.



# ఘనంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు

- కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్ల, ఉచిత మజ్జిగ పంపిణీ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం

**చొప్పదండి, జూన్ 5 (జనం సాక్షి):** చొప్పదండి పట్టణంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ,పట్టణ పార్టీ అధ్యక్షుడు నిజానపురం చందుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఎమ్మెల్యే జన్మదిన పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు .ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు ఆద్వర్యం లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పేరుమండ్ల మానస- గంగయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పురం రాజేశం,మండలం లోని వివిధ గ్రామాల సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులు మార్కెట్ కమిటీ పాలక వర్గం,గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు అభిమానులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యునిగా..
# బాధ్యతలు స్వీకరించిన ఎండి.ఆసిఫ్ అలీ

### రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘన సత్కారం



**కద్తాల్ జూన్ 05(జనంసాక్షి):** హైదరాబాద్ లోని సోమాజిగూడ లో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులుగా ఛైర్మెన్ సిరిసిల్ల రాజయ్య మరియు సెక్రటరీ క్యాతాయిని దేవి సమక్షంలో శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా ఎండి.ఆసిఫ్ అలీ ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలను స్వీకరించారు.ఆసిఫ్ అలీ,తో పాటు సభ్యులుగా రంగరాజు,సుధీర్ రెడ్డి,లు పదవి బాధ్యతలను చేపట్టారు.అనంతరం రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో పూల బొకేను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీ మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వానికి పంచాయితీలకు మధ్య నిధుల పంపిణీకి సంబంధించిన సిఫార్సులను అమలు చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రాజ్యాంగ సవరణ చేసి స్థానిక సంస్థలకు నిధులు కేటాయింపులకు కృషి చేశారని గుర్తు చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామపంచాయతీలు,మండల పరిషత్ లను నిర్వీరం చేశారని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తనపై నమ్మకం పెట్టి కమిషన్ సభ్యునిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ,సంతోషంగా ఉందని ఆసిఫ్ అలీ తెలిపారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జల మహేష్,రేవంత్ మిత్రమండలి సభ్యులు ఆనంద్,అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారుల నియంత్రణ కరువైంది. ఏటా ఫీజులు పెంచుతూ భారీగా వసూలు చేస్తున్నా కనీస చర్యలు తీసుకునే వారు లేరు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేదు. నామమత్రంగా తనిఖీ చేస్తూ వదిలేస్తున్నారు. గుర్తింపు లేని పాఠశాలలపైనా చర్యలు చేపట్టడం లేదు. కొన్ని పాఠశాలలకు నోటిసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు.




# బడి దడ

## పెరిగిన ప్రైవేటు పాఠశాలల ఫీజులు

- అదే స్థాయిలో నోటుబుక్కుల ధరలు
- మధ్య తరగతి కుటుంబాలపై భారం
- కార్పొరేట్ తరహాలో ప్రైవేట్ విద్య

### వేలల్లో ఫీజులు..

ఎల్‌కేజీ నుంచి ఉన్నత చదువుల వరకు ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్, షూస్ తదితర వస్తువులను కూడా ఆయా పాఠశాలల ద్వారా కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై పాఠశాల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సూచించిన బుక్‌స్టాళ్లు,దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని చెబుతున్నాయి.
ఎల్‌కేజీ,యూకేజీ చదువులకు ఏడాదికి రూ 25 వేల వరకు,1 నుంచి 5వ తరగతి వరకు రూ 40 వేల వరకు,పదో తరగతి వరకు రూ 70 వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** అక్షరం నేర్చుకోవాలంటే లక్షణంగా లక్షలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితులు నేడు నెలకొన్నాయి.జూన్ వచ్చిందంటే తల్లిదండ్రులకు బడి దడ మొదలవుతోంది.ఈ నెలలోనే విద్యా సంవత్సరం ఆరంభం ఉండటంతో ఆర్థిక భారం పెరుగుతోంది.12 నుంచి బడులు ప్రారంభం కానుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది..

### జిల్లాకు కార్పోరేట్ సంస్థలు..

జిల్లా కేంద్రం సిరిసిల్లతో పాటు ధార్మిక కేంద్రమైన వేములవాడలో కార్పొరేట్ తరహా విద్యాసంస్థలు సంవత్సరానికి మూడు,నాలుగు పుట్టుకొ స్తున్నాయి. హంగులు ఆర్భాటాలతో ప్రచారం చేస్తున్న విద్యాలయాలు అదే స్థాయిలో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పాఠశాలలకు ఆటస్థలం లేకపోయినా తాము క్రీడలకు ప్రాధాన్యత ను ఇస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తూ తల్లిదండ్రు లను మోసగిస్తున్నట్లుగా చర్చ జరుగుతోంది. ఈ పాఠశాల ఐఐటి, నీట్ పోటీ పరీక్షలకు ఫౌండేషన్ కోర్సులు అందిస్తామంటూ సాధారణ ఫీజులకు అదనపు ఫీజులు వసూలు చేయడంతో పాటు అందుకు సంబంధించిన బుక్కులను అంటగడు తున్న ట్టుగా తెలుస్తోంది.వీటిని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన విద్య శాఖ అధికారులు ప్రభుత్వ బడిలో విద్యార్థులు చేర్చుకోవడానికి బడిబాట తదితర అంశాల్లో తలామునుకలై పర్య వేక్షణ గాలికి వదిలేసినట్లుగా తెలుస్తోంది. ప్రైవేట్ విద్యాలయాలు దీన్ని ఆసరాగా చేసుకొని విద్యాలయ ఆవరణలో పుస్తకాల అమ్మకాన్ని చేస్తూ బుక్స్ సెల్లర్ విధానాన్ని అవలంబిస్తు న్నట్లుగా విద్యార్థి సంఘాలు మండిపడుతున్నా యి. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలసిన అవసరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఉంది.

### కనీస సౌకర్యాలు కరువు..

తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యా యి. వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. చాలా పాఠశాలల్లో రేకుల భవనాలే తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. ఎలాంటి వెలుతు రు ఉండడంలేదు. పిల్లలకు ఆడుకోవడానికి కూడా గ్రౌండ్ లేదు. అనుమతుల సమయంలో విద్యాశాఖ చేతివాటం వల్ల విద్యార్థులకు క్రీడాసౌకర్యాలు ఎండమావిగా మారుతున్నాయి. అలాగే పాఠశాల యాజమాన్యాలు వారికి అనుకూలమైన వారిని పెట్టుకుని పేరెంట్స్ కమిటీల సమావేశాలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి.



| డీఈవో పరిధిలో (గణాంకాలు) : | ప్రభుత్వ | ప్రైవేట్ |
|---|---|---|
| పాఠశాలలు | 511 | 132 |
| విద్యార్థులు | 38629 | 31026 |

# పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రారంభం

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 5 (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా శుక్రవారం వేములవాడలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ కు సర్వే కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం ఆయన ఇంటింటి సర్వేలో పాల్గొని మాట్లాడుతూ జాతీయ గణాంక శాఖ 2026 కు గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వేములవాడలో సర్వే చేశామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామన్నారు.తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతలు, చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు,ఉద్యోగం, స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో, ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వారి ఆదాయ వివరాలు, ఆన్లైన్ ఆర్డర్స్, ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గు వర్కర్స్ జొమాటో, స్విగ్గి, రాపిడో, ఓలా ,ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్‌లో పనిచేసే టువంటి వ్యక్తుల విషయాలను నమోదు చేసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి ,ఎంపీఎస్ఓ, తిరుపతి, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# మేడిపల్లి భూములను ఇండస్ట్రియల్ పార్క్‌కు అప్పగిస్తున్నాం

**పంటలు ఎవరు వేయవద్దు : గ్రామ సభలో మంథని ఆర్డీవో కాశబోయిన సురేష్**

**రామగిరి జూన్ 5 (జనంసాక్షి) :**రామగిరి ఖిల్లా కు సంబంధించి మేడి పల్లి శివారు లోని భూములను ఇండస్ట్రియల్ పార్క్ కు అప్పగిస్తున్నామని మంథని ఆర్డీవో కాశబోయిన సురేష్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అధ్యక్షతన గ్రామసభ జరగగా,ఆర్డీవో సురేష్, తాహసిల్దార్ పర్నంది.సుమన్ హాజరయ్యారు. మేడిపల్లి శివారులో 80 శాతం భూమిని తీసుకోవడం జరిగిందని, ఎకరానికి రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. 200 ఎకరాలకు పైగా పట్టా, ప్రభుత్వ భూములు తీసుకుంటున్నామని తెలిపారు. 9 మంది రైతుల భూములు వివాదాస్పదంగా ఉండగా వాటి పరిష్కారం కొరకు గ్రామసభలు ఆర్డీవో సురేష్, తాహసిల్దార్ సుమను రైతులతో మాట్లాడారు. త్వరలో మిగతా భూములలో రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. ఎవరు కూడా బాధపడవద్దని అన్ని భూముల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామాభివృద్ధి కొరకు సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారని మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్షణ దృష్టికి తీసుకువెల్లి, నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతుల రుణమాఫీ, రెండు గుంటల భూమి, పావులా వడ్డీకి 10 లక్షల రుణం, ఇతరత్ర సమస్యలు రైతులు అడగగా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్.ఐ కె.మహేష్, గడ్డం రవిశంకర్, సర్వేయర్ నాగండ్ల రాధిక, జీపీఓ పెర్క వెంకటేశ్వర్లు,సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## చిరు వ్యాపారులు రహదారులను ఆక్రమించకూడదు

- ఆకుల వెంకటేష్.మున్సిపల్ కమిషనర్
- పెద్దపల్లి పట్టణ ప్రజలు డ్రైనేజీలో, రోడ్డుపై చెత్త వేయరాదు

**పెద్దపల్లి,జూన్ 05(జనంసాక్షి) :** పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో గురువారం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలమట్టమయ్యాయి.ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను, డ్రైనేజీ సమస్యలను స్వయంగా పరిశీలించి, శానిటేషన్ సిబ్బంది సహకారంతో డ్రైన్ బ్లాకేజ్ సమస్యలను తక్షణమే పరిష్కరింపజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రోడ్లపైన, డ్రైన్లలో చెత్తను వేయడం వల్లే డ్రైనేజీలు పూడికకు గురవుతున్నాయని, దీనివల్ల వర్షపు నీరు సజావుగా సాగక ఇళ్లలోకి ప్రవేశిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఇలాంటి సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కాబట్టి ఎవరూ కూడా డ్రైన్లలో చెత్తను వేయకూడదని విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం కఠిన చర్యలు: రోడ్లపైన వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు రహదారులను ఆక్రమించకూడదని కమిషనర్ స్పష్టం చేశారు.చెత్తను ఇష్టానుసారంగా రోడ్లపై వేస్తే మున్సిపల్ యాక్ట్ 2019 నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, భారీగా జరిమానాలు విధిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.పట్టణ పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కొమ్ము సుధాకర్ పాగాల శ్రీకాంత్,మున్సిపల్ అధికారులు,శానిటేషన్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పంటలు ఎవరు వేయవద్దు

- మేడిపల్లి భూములను ఇండస్ట్రియల్ పార్క్‌కు అప్పగిస్తున్నాం
- గ్రామ సభలో మంథని ఆర్డీవో కాశబోయిన సురేష్



**రామగిరి జూన్ 5 (జనంసాక్షి) :** రామగిరి ఖిల్లాకు సంబంధించి మేడి పల్లి శివారులోని భూములను ఇండస్ట్రియల్ పార్క్‌కు అప్పగిస్తున్నా మని మంథని ఆర్డీవో కాశబోయిన సురేష్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అధ్యక్షతన గ్రామసభ జరగగా,ఆర్డీవో సురేష్, తాహసిల్దార్ పర్నంది.సుమన్ హాజరయ్యారు. మేడిపల్లి శివారులో 80 శాతం భూమిని తీసుకోవడం జరిగిందని, ఎకరానికి రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. 200 ఎకరాలకు పైగా పట్టా, ప్రభుత్వ భూములు తీసుకుంటున్నామని తెలిపారు. 9 మంది రైతుల భూములు వివాదాస్పదంగా ఉండగా వాటి పరిష్కారం కొరకు గ్రామసభలు ఆర్డీవో సురేష్, తాహసిల్దార్ సుమను రైతులతో మాట్లాడారు. త్వరలో మిగతా భూములలో రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. ఎవరు కూడా బాధపడవద్దని అన్ని భూముల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామాభివృద్ధి కొరకు సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారని మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్షణ దృష్టికి తీసుకువెల్లి, నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతుల రుణమాఫీ, రెండు గుంటల భూమి, పావులా వడ్డీకి 10 లక్షల రుణం, ఇతరత్ర సమస్యలు రైతులు అడగగా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్.ఐ కె.మహేష్, గడ్డం రవిశంకర్, సర్వేయర్ నాగండ్ల రాధిక, జీపీఓ పెర్క వెంకటేశ్వర్లు,సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో వరి ధాన్యాన్ని గోదాములో నిల్వ చేస్తాం

**పెద్దపల్లి,(జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో గల రైస్ మిల్లు గోదాంలో నిల్వచేసిన వరి ధాన్యాన్ని స్థానిక నాయకులతో కలిసి తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు సెంటర్ లో ఉన్నవరి ధాన్యం 98% తరలించామని పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో లారీల జాప్యం హమాలీల కొరత తో అక్కడక్కడ కొంతమేర మిగిలి ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు పెద్దపల్లి, సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ అధ్యక్షలు భారీ, తిరుపతి, శ్రీనివాస్, సతీష్‌లతో మాట్లాడి పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్, రంజిత్ ఎస్ ఐ లు పోలీసులు, అధికారుల సహకారంతో పూర్తి స్థాయిలో తరలించేందుకు చర్యలు చేపడుతున్న ట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాలలో నాలుగు కోట్ల రూపాయలు జమ అయ్యాయని మిగిలిన రూపాయలు సైతం త్వరలోనే రైతుల ఖాతాలో జమ కానున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాయింట్ సర్వేకు మహా అధికారుల డుమ్మా..

- వెనుదిరిగిన తెలంగాణ అధికారులు
- మంజీరాలో మళ్లీ మొదటికొచ్చిన పాత కథ



**బోధన్, జూన్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ భూభాగంలోకి మంజీర నదిలోకి చొచ్చుకొని వచ్చి దర్జాగా ఇక్కడి ఇసుకను దోచేస్తున్న మహారాష్ట్ర ఇసుక క్వారీల వ్యవహారాన్ని తేల్చేందుకు శుక్రవారం హద్దులు పాతేందుకు నిర్వహించిన జాయింట్ సర్వేకు మహారాష్ట్ర అధికారులు డుమ్మా కొట్టారు. మహారాష్ట్ర అధికారులు సర్వేకు వస్తామంటూ రాకపోవడం ప్రతిసారి ఇలాగే కొనసాగుతుంది. ఈరోజు సర్వేకు వస్తామంటూ మహారాష్ట్ర తాసిల్దార్, సర్వేయర్ లు స్పష్టంగా చెప్పినప్పటికీ తీరా తెలంగాణ అధికారులు మంజీరా నదిలోకి వచ్చి వారి రాక కోసం ఎదురుచూసి ఎదురుచూసి వెను తిరగాల్సి వచ్చింది. తెలంగాణ భూభాగంలోని మంజీరా నదిలోకి చొచ్చుకొని వచ్చి మహారాష్ట్ర ఇసుక క్వారీ నిర్వాహకులు దర్జాగా మంజీరాను తోడేస్తున్నప్పటికీ జిల్లా యంత్రాంగం పట్టీ పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది. మంజీరాలో తెలంగాణ భూభాగం హద్దును నిర్ధారించే విషయంలో జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోకపోవడం తో మంజీరా తీర ప్రాంత గ్రామాల ప్రజలు ప్రతి సంవత్సరం ఘర్షణ వాతావరణంలో జీవించాల్సి వస్తుంది. శాశ్వత పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం జిల్లా అధికారులు ఒక లేఖను రాసి ప్రభుత్వం ద్వారా మహారాష్ట్ర ప్రభుత్వంకు సైతం లేఖను అందించి అక్కడి ఉన్నతాధికారులు ఇక్కడి ఉన్నతాధికారులతో సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తే గాని దీనికి శాశ్వత పరిష్కారం లభించే అవకాశం లేదని మంజీర తీర ప్రాంత ప్రజలు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ భూభాగం నుండి ట్రాక్టర్ ను తీసుకెళ్తే కేసులు చేసే అధికారులకు మహారాష్ట్ర ఇసుక నిర్వాహకులు కోట్ల రూపాయల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం తెలిసినప్పటికీ ఆ దిశగా అడుగులు ఎందుకు వేయడం లేదని మంజీర ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఇరు రాష్ట్రాల అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తే గాని మంజీరాలో హద్దుల విషయం తేలేదనే విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే.

## ఈ నెల 7న పెద్దపల్లికి మాజీ మంత్రి హరీష్ రావు

**పెద్దపల్లి,జూన్ 05(జనంసాక్షి) :** పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా,భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజా సమస్యలపై పోరాట వ్యూహాలను ఖరారు చేసేందుకు ఈ నెల 08న నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు.పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి మెయిన్ రోడ్డులో గల తిరుమల గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్,మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు హాజరై,పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడానికి,ప్రజా పక్షాన నిలబడి పోరాడటానికి ఈ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు,నియోజకవర్గంలోని ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు,అన్ని మండలాల, పట్టణాల కార్యవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 5 (జనంసాక్షి) :** వేములవాడ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు,ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బందితో నంది కమన్ చౌరస్తా వద్ద పరిశీలించారు. చౌరస్తా పరిసరాల్లో ప్రమాదాల నివారణకు,వాహనాల సులభతర రాకపోకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా నంది కమాన్ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వాటిని గమనించారు. ఆ దుకాణదారులతో మూడు విభాగాల శాఖ అధికారులు మాట్లాడి భద్రత కారణాల దృష్ట్యా తక్షణమే ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ క్షేత్రానికి ప్రతిరోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు,వారి వాహనాలు వస్తుంటాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి,ప్రమాద రహిత జోన్లుగా మార్చడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మున్సిపల్, పోలీస్, ఆర్ అండ్ బి అధికారులు ఉమ్మడిగా ఈ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టామన్నారు. నంది కమాన్ చౌరస్తా వద్ద భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా శాస్త్రీయ పద్ధతిలో స్పీడ్ బ్రేకర్లు, వాహనదారులను అప్రమత్తం చేసే సైన్ బోర్డుల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ జాంలు కాకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో స్థానిక వ్యాపారస్థులు కూడ మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. రోడ్లపైకి తోపుడు బండ్లు, పండ్ల దుకాణాలు నెట్టడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందని, కాబట్టి ఎవరూ నిబంధనలను ఉల్లంఘించకుండా కేటాయించిన పరిధిలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్,కౌన్సిలర్ కాశ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మారుపాక సర్పంచ్ దొబ్బల మల్లేశం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్, పోలీస్,ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ విభాగల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణం నుంచి రైతు రక్షణ వరకూ..

- ప్లాస్టిక్ నిర్మూలనకు జూట్ బ్యాగుల పంపిణీ
- రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యత్వం స్వీకరణ
- కలెక్టరేట్‌లో నీటి నిల్వ చెరువు ప్రారంభం : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కార్యాచరణ
- తడిసిన వరి తరలింపుపై అధికారులకు ఆదేశాలు





**కామారెడ్డి, జూన్ 5 (జనంసాక్షి):**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత జీవన విధానాలను ప్రోత్సహించడంతో పాటు అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం రైతులకు నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం' కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జూట్ బ్యాగులు, టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోం దని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజాసంబంధాల శాఖ, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బందికి పర్యావరణహిత వస్తువులను అందజేశారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వి. గిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
అనంతరం తన ఛాంబర్‌లో భారత రెడ్‌క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వం పొందారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితులు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సేవలు వంటి రంగాల్లో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉన్న ప్రజలు జీవితకాల సభ్యత్వం పొందాలని కోరారు. సభ్యత్వం పొందదలచిన వారు జూన్ 15లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో డీఎంఎఫ్‌సీటీ నిధులతో రూ.6.55 లక్షల వ్యయంతో నిర్మించిన నీటి నిల్వ చెరువును కలెక్టర్ ప్రారంభించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ సమతుల్యతకు ఇటువంటి చెరువులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు చేపడుతున్న చర్యలు ఆదర్శప్రాయమని అన్నారు. అనంతరం చెరువు పరిసరాల్లో మొక్కలు నాటి, పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని పచ్చదనంతో అభివృద్ధి చేస్తే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు అనుకూలంగా మారుతుందని తెలిపారు.
మరోవైపు అకాల వర్షాల ప్రభావంతో తడిసిన ధాన్యం రైతులకు నష్టం కలగకుండా వెంటనే తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కామారెడ్డి డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షాలకు సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడవడంతో రామేశ్వర్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న ఆయన, తడిసిన ధాన్యాన్ని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు.
ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేయాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీసీఓ రామ్మోహన్‌రావు తదితర అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో పారాబాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశమై తడిసిన వరిని వెంటనే అన్‌లోడ్ చేసి స్వీకరించాలని సూచించారు. తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
జిల్లాలో ఇప్పటివరకు 4.19 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గిరి, డీఆర్డీవో దామోదర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# స్పా సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు

- మల్కాజిగికి ప్రాంతంలో ఏకకాలంలో దాడులు
- 113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు



**హైదరాబాద్, జూన్5 (జనంసాక్షి) :** నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు. స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీ లబ్ధిదారులకు నాణ్యమైన పోషకాహారం

- ఆహార భద్రత ప్రమాణాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- మంత్రి సీతక్క ఆదేశాలతో జూన్ 7న రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



**హైదరాబాద్, జూన్ 5 (జనంసాక్షి) :** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్వాడీ సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు ఈ ఆదివారం నాడు (జూన్ 7) వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే ను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షితమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ కేంద్రాలు భవిష్యత్ తరాల ఆరోగ్యానికి పునాది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే ప్రతి ఆహార పదార్థం నాణ్యంగా, సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా అందించే సేవల నాణ్యతను మరింత పెంచడం, పోషకాహార లోపాలను తగ్గించడం, లబ్ధిదారుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.

# పరిరక్షణ బాధ్యత అందరిదీ

- పర్యావరణంతో సంబంధం లేదని అనలేం
- కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, జూన్ 5 (జనంసాక్షి) :** పర్యావరణ బాధ్యత అందరిదనీ, ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

# భూకబ్జా కుట్రదారుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

- తమిళనాడు కాంచీపురంలో అరెస్ట్...హైదరాబాద్‌కు తరలింపు
- వైకాపా నేతపై పలు సెక్షన్ల కింద కేసులు



**హైదరాబాద్, జూన్5 (జనంసాక్షి) :** నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మనాయుడును అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగంతోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

# కల్తీ పదార్థాలతో చాక్లెట్ల తయారీ

**హైదరాబాద్, జూన్5 (జనంసాక్షి) :** మహానగరంలోని కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టును హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్ రట్టు చేసింది. సీతారాంబాగ్ ప్రాంతంలో విగ్నెట్ ఫుడ్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై హెచ్ ఫాస్ట్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి కార్తీక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసింది. ఈ సంస్థలో రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఈ సంస్థపై సదరు టీమ్ దాడి చేసింది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

- 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730

**న్యూఢిల్లీ, జూన్5 (జనంసాక్షి) :** భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కొత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. గురువారం ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది.

# అర్థరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్

- అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి



**నల్లగొండ, జూన్ 5 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

# జార్ఖండ్‌లో కాంగ్రెస్‌కు జెఎంఎం ఝలక్

- రెండు రాజ్యసభ సీట్లకు అభ్యర్థుల ప్రకటన



**రాంచీ, జూన్ 5 (జనంసాక్షి) :** జార్ఖండ్‌లోని 'ఇండియా' కూటమిలో తాజాగా విభేదాలు పొడచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖండ్ నుంచి రెండు రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, రాష్ట్రంలో జేఎంఎం భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఒక సీటును ఆశిస్తోంది. పార్టీ నుంచి పోటీ చేసే రాజ్యసభ అభ్యర్థి పేరును ఇప్పటికే ప్రకటించింది.అయితే రెండు రాజ్యసభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు జేఎంఎం తాజాగా నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. దీనిపై భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై జేఎంఎం శాసనసభ్యులు, మంత్రులు, ఎంపీలు, సీనియర్ నేతలు శుక్రవారంనాడు సమావేశమయ్యారు. ఖాళీగా ఉన్న రెండు సీట్లలోనూ జేఎంఎం పోటీ చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం కుదరినట్టు సమావేశానంతరం రాష్ట్ర మంత్రి యోగేంద్ర మెహతో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కే అప్పగించినట్టు వివరించారు. ఈ క్రమంలో రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు భాగస్వామ్య పార్టీలతో సోరెన్ సంప్రదింపులు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ÷ూగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జార్ఖండ్ నుంచి పోటీ చేసే అభ్యర్థితో పాటు ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. భాగస్వామ్య పక్షంగా తమకు ఒక సీటును జేఎంఎం కేటాయిస్తుందనే అభిప్రాయంతో కాంగ్రెస్ ఉంది. రెండు సీట్లూ తమకే కావాలని జేఎంఎం పట్టుపడితే దీనిపై రాబోయే రోజుల్లో ఇరుపార్టీల మధ్య ముమ్మరంగా సంప్రదింపులు జరిగే అవకాశాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరుగనున్నాయి. జార్ఖండ్‌లో చాలాకాలంగా జేఎంఎం, కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. సోరెన్ నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కూడా ఉంది. రెండు రాజ్యసభ సీట్లు ఆశించడం ద్వారా జార్ఖండ్ రాకీయాల్లో తమ బలం చెక్కుచెదరకూడదని జేఏఎం భావిస్తుండగా, కూటమి ప్రభుత్వంలో తాము రాజకీయ ప్రాధాన్యం కోల్పోరాదని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.

# విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు

- ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
- ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు



**విశాఖపట్నం, జూన్ 5 (జనంసాక్షి) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు.

# మాజీ ప్రియురాలి దారుణ హత్య

- కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన దుండగుడు
- అనంతరం అదే కత్తితో పొడుచుకున్న దుర్మార్గుడు
- యువతి మృతి..యువకుడి పరిస్థితి విషమం

**చండీఘడ్, జూన్ 5 (జనంసాక్షి) :** పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతి మాజీ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. మాజీ ప్రియుడు ఆ యువతిని 20 సార్లు కత్తితో పొడిచి చంపాడు. యువతిని చంపిన తర్వాత అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మొహాలికి చెందిన హర్వీందర్ మన్ అలియాస్ హ్యారీ, డింపుల్ మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో కలిసి పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ కొత్త కంపెనీలో చేరారు. కొత్త కంపెనీలో చేరిన కొంతకాలం వీరి బంధం సజావుగానే సాగింది. తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరూ విడిపోయారు. డింపుల్‌తో విడిపోవటం హ్యారీకి ఇష్టం లేదు. మళ్లీ ఆమెతో ఒక్కదవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. డింపుల్ ఇందుకు ఒప్పుకోవటం లేదు. దీంతో అతడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. గురువారం డింపుల్ డ్యూటీలో ఉండగా.. రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హ్యారీ ఆఫీస్‌కు వచ్చాడు. ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కత్తితో డింపుల్‌ను 20 సార్లు అతి కిరాతకంగా పొడిచాడు. తర్వాత అదే కత్తితో తన గొంతులో 30 సార్లు పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు.

# అసమ్మతికి కళ్లెం వేసే యత్నం

- లోక్‌సభకు పోటీచేసే యోచనలో మమత



**కోల్‌కతా, జూన్5 (జనంసాక్షి) :** తృణమూల్ కాంగ్రెస్‌కు లోక్స భలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరమితమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారురు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపూర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు. మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పూర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్ అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. రైల్వేమంత్రిగానూ పనిచేశారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తింది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు సన్నిహితురాలిగా పేరున్న పార్టీ సీనియర్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ బహిరంగంగానే ఇటీవల తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బరాసత్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఉన్న ఆమె లోక్‌సభలో తనపై అనుచితంగా మాట్లాడుతున్నారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ పనితీరును ప్రశ్నించిన సీనియర్ ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్, శాంతను సేన్ సైతం ఉన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తిరుగుబాటును టీఎంసీ ఎదుర్కొంటోంది. టీఎంసీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీకి చెందిన 57 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. స్పీకర్ రతీంద్ర బోస్ కూడా ఈ నియామకాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా లోక్‌సభలో అసమ్మతికి కళ్లెం వేసేందుకు సభలో అడుగుపెట్టాలనే ఆలోచనలో మమతా బెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370